


VARTHAA SAKSHAMU
RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ | సంపుటి : 01 | సంచిక : 71 | మంగళవారం 01 సెప్టెంబర్ 2026 | పేజీలు : 8 | వెల : 2/-

# భగీరథ ప్రయత్నంతో కరవు సీమకు కృష్ణమ్మ






**●30 ఏళ్ల కల సాకారం..వెలిగొండ ప్రాజెక్టు తొలిదశ ప్రారంభించిన సీఎం ●నల్లమల కొండల్ని చీల్చుకుని నల్లమల సాగర్‌కు కృష్ణమ్మ పరుగు ●తొలిదశతో 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు..4 లక్షల మందికి తాగునీరు ●జలహారతి అనంతరం కృష్ణా జలాలకు సీఎం సాష్టాంగ నమస్కారం ●2028లో రెండోదశ పూర్తి...మార్కాపురంలో కృష్ణా పుష్కరాలు ●మార్కాపురం దోర్నాల వద్ద బహిరంగ సభలో సీఎం చంద్రబాబు ప్రసంగం**

మార్కాపురం, ఆగస్టు 31 వార్త సాక్ష్యం

మూడు దశాబ్దాలుగా ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజలు ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు కల సాకారమైంది. పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జాతికి అంకితం చేశారు. దోర్నాల మండలం గంటవానిపల్లె వద్ద నల్లమల కొండల్లోని జంట సొరంగాల నుంచి వెలువడిన కృష్ణా జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, జల హారతి ఇచ్చి స్వాగతించారు. అనంతరం ప్రాజెక్టు తొలిదశ ప్రారంభోత్సవానికి సూచికగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కరవునేలను తాకిన కృష్ణా జలాలకు ముఖ్యమంత్రి సాష్టాంగ నమస్కారం చేశారు. శ్రీశైలం జలాశయంలోని కొల్లం వాగు నుంచి గ్రావిటీ ద్వారా తరలించిన కృష్ణా జలాలు వెలిగొండ జంట సొరంగాల మీదుగా గంటవానిపల్లె ఆక్విడెక్టుకు చేరుకుని నల్లమల సాగర్ వైపు పరుగులు తీశాయి. నల్లమల కొండలను చీల్చుకుని కాలువల్లో ప్రవహించిన కృష్ణమ్మకు స్థానిక మహిళలు, ప్రజలు పుష్పాలతో ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం పవిత్ర జలాలను సీఎం చంద్రబాబు మంత్రులు, అధికారులు, ప్రజా ప్రతినిధులపై స్వయంగా చల్లారు. అక్విడెక్టు వద్ద రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి స్విచ్ నొక్కి జలాలను దిగువకు వదిలారు.

**-30 ఏళ్ల క్రితం భూమిపూజ.. నేడు ప్రారంభం**

వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం తన జీవితంలో భావోద్వేగ సందర్భమని చంద్రబాబు పేర్కొన్నారు. 1996 మార్చి 5న ముఖ్యమంత్రిగా తానే ఈ ప్రాజెక్టుకు భూమిపూజ చేశానని, సరిగ్గా 30 ఏళ్ల తర్వాత 2026 ఆగస్టు 31న ప్రాజెక్టు మొదటి దశను ప్రారంభిస్తున్నానని చెప్పారు. సీఎం మాట్లాడుతూ.. "ఆ రోజు చేసిన సంకల్పం.. ఈ రోజు నల్లమల సాగర్‌లో జలసిరిగా మారింది. ఇది భగీరథ ప్రయత్నం. కొండలు అడ్డు వచ్చినా తొలిచి ముందుకు వెళ్లాం. కరువు నేలకు కృష్ణమ్మను తీసుకొచ్చాం. శ్రీశైలం మల్లన్న సన్నిధి నుంచి బయలుదేరిన కృష్ణమ్మ.. మార్కాపురం చెన్న కేశవుడు కొలువైన నేలకు జలహారతి ఇస్తోంది. ప్రజలు ఇచ్చిన తీర్పుతోనే వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించుకుని జల సిరులతో ఈ ప్రాంత అభివృద్ధికి రెక్కలు తొడిగాం. వెలిగొండ బంగారు కొండ అవుతుంది. ఈ ప్రాంత ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతుంది. మాట ఇచ్చాం.. ప్రాజెక్టు పూర్తి చేసి కృష్ణమ్మను తరలించాం. ఇక సంపద సృష్టిస్తాం. మార్కాపురం గడ్డకు, కరువుతో పోరాడిన రైతన్నలకు, ఫ్లోరైడ్ బాధలు భరించిన కుటుంబాలకు, నీటి కోసం ఎదురు చూసి అలసిపోయిన తరాలకు కృష్ణా జలాలతో కొత్త ఊపిరి ఇస్తున్నాం."అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

**-నిర్వాసితుల త్యాగాలకు పాదాభివందనం**

వెలిగొండ ప్రాజెక్టు కోసం భూములు, ఇళ్లు, గ్రామాలను త్యాగం చేసిన 11 గ్రామాల ప్రజలకు పాదాభివందనం చేస్తున్నానని సీఎం అన్నారు. రైతుల త్యాగం లక్షల మంది జీవితాల్లో వెలుగులు నింపుతోందన్నారు. "ప్రాజెక్టు వల్ల లబ్ధి పొందేవారు ఎంత సంతోషంగా ఉంటారో.. నిర్వాసితులు కూడా అంతే సంతోషంగా ఉండాలి. కేవలం 48 రోజుల్లో 6,206 నిర్వాసిత కుటుంబాలకు రూ.768 కోట్ల పరిహారం అందించాం. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ నిర్వాసితుల బాధలు, అవసరాలను గుర్తించి అదనంగా మరో రూ.169 కోట్లు చెల్లిస్తున్నాం. కటాఫ్ తేదీని పెంచి 18 ఏళ్లు నిండిన యువతకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున అందించాం. రూ.10,200 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన వెలిగొండ ప్రాజెక్టులో ఇప్పటివరకు రూ.7,983 కోట్లు ఖర్చు చేసి మొదటి దశను పూర్తి చేశాం. 18.8 కిలోమీటర్ల మేర జంట సొరంగాలు, 21.8 కిలోమీటర్ల ఫీడర్ కాలువల పనులు పూర్తి అయ్యాయి. తొలిదశలో భాగంగా నల్లమల సాగర్‌కు 10.70 టీఎంసీల నీటిని తరలిస్తాం. 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు అందుతుంది. వెలిగొండ పూర్తయితే ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని 30 మండలాల్లో 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 23 లక్షల మందికి తాగునీరు అందుతుంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 3.36 లక్షల ఎకరాలు, నెల్లూరు జిల్లాలో 84 వేల ఎకరాలు, కడప జిల్లాలో 27 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. తీగలేరు కాలువ కింద 62 వేల ఎకరాలు, గొట్టిపడియ కాలువ కింద 9,500 ఎకరాలు, తూర్పు ప్రధాన కాల్వ కింద 3.70 లక్షల ఎకరాల ఆయకట్టు సుస్థిరం అవుతుంది. కృష్ణమ్మ రాకతో పశ్చిమ ప్రకాశంలో ఫ్లోరైడ్ అనే పదం గత చరిత్రగా మిగిలిపోతుంది. వెలిగొండ అంటే ఫ్లోరైడ్ కష్టాలకు ముగింపు. కరువు నేలపై కృష్ణమ్మ రాసిన కొత్త చరిత్ర." అని ముఖ్యమంత్రి అభివర్ణించారు.

**-వెలిగొండకు 2019లో గ్రహణం.. 2024లో విముక్తి**

"2019లో గొడ్డలి పార్టీ అధికారంలోకి రావడంతో వెలిగొండ ప్రాజెక్టుకు గ్రహణం పట్టింది. విలువైన నిర్మాణ కాలాన్ని వృథా చేశారు. నిర్వాసితుల కోసం జీవో ఇచ్చి అరకొరగా చెల్లింపులు చేశారు. ఎన్నికలకు నెల రోజుల ముందు ప్రాజెక్టును పూర్తి చేశామని చెప్పడం, రూ.4 వేల కోట్ల పనులు పెండింగ్‌లో ఉండగానే జాతికి అంకితం చేశామని ప్రకటించడం ప్రజలను మోసం చేయడమే. ఫేక్ డ్రామాలు, సినిమా సెట్టింగులతో ప్రజల్ని, రైతుల్ని మోసం చేసిన వ్యక్తుల్ని ఏం చేయాలి. రెండు సొరంగాలు మొత్తం తిరిగానని చెప్పుకుంటున్న వ్యక్తులు ఈ ప్రాజెక్టు నుంచి నీళ్ళు ఎందుకు ఇవ్వలేదు. పనులు చేసేశామని చెప్పి బుకాయించటం తప్పు. ఫేక్ మాటలు చెప్పే వ్యక్తుల్ని, మోసం చేసిన వారి గురించి ఈ ప్రాంత ప్రజలు నిలదీయాలి. గొడ్డలి పార్టీ హయాంలో సొరంగాల్లో టీబీఎం యంత్రం ఇరుక్కు పోవడంతో పనులు పూర్తికాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే సమస్యలను పరిష్కరించి పనులు పూర్తి చేసి ఇప్పుడు కృష్ణా జలాలను అందించింది. చరిత్రను ఎవరూ తిరగ రాయలేరు. ఫేక్ ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొడతాం. చెడును ఖండించాలి. మంచి చేసిన ప్రభుత్వానికి అండగా ఉండాలి."అని సీఎం వ్యాఖ్యానించారు.

**-మార్కాపురంలోనూ 2028 కృష్ణా పుష్కరాలు**

వెలిగొండ ప్రాజెక్టు మొత్తం పూర్తికావడానికి మరో రూ.1,900 కోట్ల పనులు చేయాల్సి ఉందని చంద్రబాబు తెలిపారు. వెలిగొండ ఫేజ్-2ను కూడా 2028 నాటికి పూర్తి చేసే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని ప్రకటించారు. మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేశామని, రాయలసీమ హార్టీకల్చర్ హబ్‌లో మార్కాపురాన్ని భాగం చేశామని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి ప్రాంతాన్ని సమానంగా అభివృద్ధి చేయడమే ఎన్డీఏ విధానమని, రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తా ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధి సాధిస్తామని స్పష్టం చేశారు. దేశం ఎదుర్కొంటున్న నీటి సమస్యలకు నదుల అనుసంధానమే పరిష్కారమని చంద్రబాబు అన్నారు. పోలవరం రాష్ట్రానికి జీవనాడి అని, 2027 మార్చి నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని చెప్పారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలను అనకాపల్లికి తరలిస్తున్నామని, తదుపరి వంశధార వరకూ తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. దక్షిణ భారతదేశంలో గోదావరి-కావేరి అనుసంధానం జరగాలని, మహానది-గంగానదులను అనుసంధానిస్తే దేశం సుభిక్షంగా మారుతుందని ఆకాంక్షించారు. వచ్చే మూడేళ్లలో 36 ప్రాజెక్టులను పూర్తి చేసేలా ఇరిగేషన్ క్యాలెండర్ రూపొందించామని చెప్పారు. ప్రతి వర్షపు నీటి చుక్కను పొదుపు చేసి భూగర్భజలంగా మార్చుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. 2028లో జరిగే కృష్ణా పుష్కరాలను మార్కాపురంలోనూ వైభవంగా నిర్వహించుకుందామని చంద్రబాబు అన్నారు. గోదావరి జలాలు నల్లమల సాగర్ వరకూ రావాలని, అందుకోసం ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని తెలిపారు. ఓట్లు ఆశించి కాదు.. మార్పు ఆశించి పనిచేస్తున్నామని.. ఎన్నికల కోసం కాదు.. ప్రజల జీవితాలను మార్చేందుకు, భవిష్యత్ తరాల అభివృద్ధి కోసం పనిచేస్తున్నామని సీఎం స్పష్టం చేశారు.

**-సంప్రదాయ పంచెకట్టుతో ఉల్లాసంగా..**

తెలుగు సంప్రదాయ పంచె కట్టుతో వెలిగొండ సొరంగాల ద్వారా వచ్చిన కృష్ణా జలాలకు జల హారతి ఇచ్చారు. కృష్ణా జలాలు పసుపు కుంకుమలు చల్లి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పవిత్ర జలాలను మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులపై చల్లి సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఫీడర్ కాలువ వద్ద కృష్ణమ్మ ప్రవాహానికి ముఖ్యమంత్రి సాష్టాంగ నమస్కారం చేశారు. సంప్రదాయ నృత్యాలతో కృష్ణా జలాలకు గిరిజన మహిళలు సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. బహిరంగ సభా వేదికపై ఏర్పాటు చేసిన ర్యాంపుపై కండువా తిప్పుతూ రైతులకూ, ప్రజలకూ ముఖ్యమంత్రి అభివాదం చేశారు. దివంగత పూలసుబ్బయ్య కుటుంబ సభ్యుల్ని ఆత్మీయంగా పలకరించి సన్మానించారు. ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేసేందుకు పనిచేసిన అధికారులు, ఉద్యోగాలు, జల వనరుల శాఖ మంత్రి రామానాయుడును సీఎం ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, పి. నారాయణ, కందుల దుర్గేష్, కొలుసు పార్థసారధి, అనగాని సత్యప్రసాద్, గుమ్మిడి సంధ్యారాణి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి సహా ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.







# వెలుగొండ ప్రాజెక్టు పూర్తి.. మూడు దశాబ్దాల కల సాకారం








**●సవాళ్లు, అవరోధాలను అధిగమించి కృష్ణా జలాలు నల్లమల సాగర్‌కు**

**●జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు**

మార్కాపురం ఆగస్టు 31 వార్త సాక్ష్యం

వెలుగొండ ప్రాజెక్టు ఎన్నో సవాళ్లు, అవరోధాలను అధిగమించి నేడు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్న ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే వేగవంతంగా పూర్తి చేసి కృష్ణా జలాలను నల్లమల సాగర్‌కు తీసుకువచ్చామని ఆయన పేర్కొన్నారు. పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు సాకారం కావడంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక పాత్ర పోషించారని మంత్రి తెలిపారు. 1995లో కోర్టు సమస్యలు, అనుమతులు పరిష్కారమైన అనంతరం 1996లో ప్రాజెక్టుకు శంకుస్థాపన జరిగిందని, అయితే మూడు దశాబ్దాలు గడిచినా ప్రాజెక్టు పూర్తి కాకపోవడం బాధాకరమని అన్నారు. 2024లో అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెలుగొండ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించి, 2026లోపు ప్రాజెక్టును పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని చెప్పారు. ప్రాజెక్టు పనులపై ముఖ్యమంత్రి ప్రతి 15 నుంచి 20 రోజులకు ఒకసారి సమీక్షలు నిర్వహిస్తూ నిరంతరం పర్యవేక్షించారని మంత్రి తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వెలుగొండ ప్రాజెక్టుకు నిధుల కొరత లేకుండా చూడాలని ఆర్థిక శాఖకు ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని పేర్కొన్నారు.

**కఠినమైన పనులను రెండేళ్లలో పూర్తి చేశాం**

వెలుగొండ ప్రాజెక్టు ద్వారా కృష్ణా జలాలు ప్రాంతానికి చేరేందుకు అత్యంత క్లిష్టమైన పనులను రెండేళ్లలో పూర్తి చేసినట్లు మంత్రి వివరించారు. కొల్లం వాగు వద్ద సుమారు 1.80 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తొలగింపు చేపట్టి, అవసరమైన హైడ్రాలిక్ రెగ్యులేటర్లు, సుమారు 3,250 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రాజెక్టులో అత్యంత క్లిష్టమైన సొరంగ పనుల్లో భాగంగా 4,924 మీటర్ల సొరంగ నిర్మాణాన్ని రెండేళ్లలో పూర్తి చేశామని చెప్పారు. సొరంగాలకు అవసరమైన లైనింగ్ పనులను కూడా వేగవంతం చేసి 6,988 మీటర్ల లైనింగ్ పనులను లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేసినట్లు తెలిపారు.

**ఆగిపోయిన టీబీఎంను బయటకు తీసి పనులకు మార్గం సుగమం**

వెలుగోడు సొరంగంలో సుమారు 11.8 కిలోమీటర్ల వద్ద నిలిచిపోయిన టీబీఎంను బయటకు తీసుకురావడం అత్యంత క్లిష్టమైన సవాలుగా నిలిచిందని మంత్రి చెప్పారు. గతంలో ఐదేళ్లపాటు నిలిచిపోయిన టీబీఎంను న్యాయపరమైన సమస్యలను పరిష్కరించి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అందించిన మార్గదర్శకత్వంతో రెండేళ్లలోనే బయటకు తీసుకువచ్చామని తెలిపారు. సుమారు 1,900 టన్నుల బరువున్న టీబీఎంను 175 మీటర్ల మేర సొరంగం బయటకు తీసుకురావడం ద్వారా సొరంగ పనులకు మార్గం సుగమమైందని, ఫలితంగానే నేడు కృష్ణా జలాలు వెలుగోడు ప్రాజెక్టు ద్వారా ముందుకు సాగుతున్నాయని మంత్రి వివరించారు.

**ఫీడర్ కెనాల్స్‌కు రూ.462 కోట్లతో పునరుద్ధరణ**

వెలుగోడు నుంచి నల్లమల సాగర్‌కు నీటిని తరలించే ఫీడర్ కెనాల్స్ పరిస్థితి గతంలో దారుణంగా ఉండేదని మంత్రి తెలిపారు. కాల్వల్లో పెద్ద గుంతలు ఏర్పడి, వాటి ద్వారా నిర్ణీత సామర్థ్యంలో నీటిని తరలించే పరిస్థితి లేకపోయిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ఫీడర్ కెనాల్స్ అభివృద్ధి, లైనింగ్ పనులకు రూ.462 కోట్ల నిధులు కేటాయించామని తెలిపారు. పనులు ప్రారంభించిన అనంతరం 5.3 కిలోమీటర్ల సీసీ వర్క్, 11 కిలోమీటర్ల లైనింగ్ పనులు పూర్తి చేశామని చెప్పారు. దీంతో నల్లమల సాగర్‌కు నీటిని సమర్థవంతంగా తరలించే పరిస్థితి ఏర్పడిందన్నారు.

**నిర్వాసితుల త్యాగాలకు కృతజ్ఞతలు**

వెలుగొండ ప్రాజెక్టు కోసం తమ భూములు, ఆస్తులను త్యాగం చేసిన నిర్వాసితులకు మంత్రి నిమ్మల రామానాయుడు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. వారి త్యాగాలు, సహకారం లేకుండా ఇంతటి మహత్తరమైన ప్రాజెక్టు సాకారం కావడం సాధ్యం కాదన్నారు. వెలుగొండ ప్రాజెక్టు పూర్తితో ఈ ప్రాంత రైతులకు సాగునీటి భరోసా లభించడంతో పాటు, నల్లమల సాగర్‌కు కృష్ణా జలాలు చేరుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న రైతుల కలను కూటమి ప్రభుత్వం సాకారం చేసిందని, రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నిమ్మల రామానాయుడు తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టు కోసం తమ భూములు, ఆస్తులను త్యాగం చేసిన నిర్వాసితుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లపాటు నిర్వాసితులకు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం నిర్వాసితుల సమస్యల పరిష్కారంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించారని పేర్కొన్నారు. వెలిగొండ నిర్వాసితులకు పునరావాసం, పునరావాస ప్యాకేజీ (ఆర్అండ్ఆర్) కింద సుమారు రూ.900 కోట్ల నిధులను చెల్లించినట్లు మంత్రి తెలిపారు. నిర్వాసితులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఈ నిధులను అందించామని చెప్పారు. నిర్వాసితుల నుంచి వచ్చిన వినతులు, ఫిర్యాదులను కూడా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని మంత్రి తెలిపారు. నిర్వాసితులకు ఇప్పటికే అందించిన రూ.900 కోట్లకు అదనంగా మరో రూ.169 కోట్లను కూడా అందించేందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని వెల్లడించారు. నిర్వాసితుల పట్ల ముఖ్యమంత్రి చూపుతున్న చిత్తశుద్ధికి వారి తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

**వెలిగొండను జాతికి అంకితం చేసిన ఘనత చంద్రబాబుదే**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించి జాతికి అంకితం చేయడంతో కృష్ణా జలాలు నల్లమల సాగర్‌కు చేరుతున్నాయని మంత్రి తెలిపారు. గతంలో ప్రాజెక్టుల ప్రారంభం పేరుతో కేవలం ప్రచార కార్యక్రమాలు నిర్వహించారని విమర్శించారు. అయితే నేడు వెలిగొండ ప్రాజెక్టు ద్వారా వాస్తవంగా నీరు ప్రవహిస్తూ రైతుల భూములను తడుపుతోందని పేర్కొన్నారు. మాటలతో కాదు.. నీటితోనే అభివృద్ధిని చూపిస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని మంత్రి అన్నారు.

**హంద్రీనీవా నుంచి వెలిగొండ, పోలవరం వరకు జలవనరులపై ప్రత్యేక దృష్టి**

రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల పూర్తి విషయంలో కూటమి ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. గత ఏడాది హంద్రీనీవా ప్రాజెక్టుకు రూ.3,850 కోట్లు ఖర్చు చేసి సుమారు 725 కిలోమీటర్ల మేర కృష్ణా జలాలను తరలించేలా పనులను ముందుకు తీసుకెళ్లినట్లు చెప్పారు. ప్రస్తుతం వెలిగొండ ప్రాజెక్టు ద్వారా నల్లమల సాగర్‌కు కృష్ణా జలాలను తరలిస్తున్నామని తెలిపారు. గోదావరి వరద జలాలను రాష్ట్రంలోని అవసరమైన ప్రాంతాలకు తరలించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. 2027 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి గోదావరి జలాలను రాష్ట్రవ్యాప్తంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు.

**ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రానికి నీరు..లిఅభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం**

రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. రిజర్వాయర్లు, కాలువలు, ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా జలాలను తరలిస్తూ వ్యవసాయ రంగానికి భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తితో ప్రకాశం, నెల్లూరు, కడప తదితర ప్రాంతాల్లో సాగునీరు, తాగునీటి అవసరాలకు మరింత భరోసా ఏర్పడుతుందని మంత్రి పేర్కొన్నారు. ప్రజలకు మేలు చేసే అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని మంత్రి కోరారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతుల భూములను సస్యశ్యామలం చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు.



VARTHAA SAKSHAMU
వార్త సాక్షం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR


# సంపాదకీయం

## పురపాలక చట్టాలను సవరిస్తేనే రిజర్వేషన్లకు న్యాయం!




పట్టణ స్థానిక సంస్థలైన నగర పంచాయతీలు, మునిసిపాలిటీలు, నగరపాలక సంస్థలలో చైర్‌పర్సన్, మేయర్ పోస్టులకు షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డు తెగలు, వెనుకబడిన తరగతులు, మహిళలకు రిజర్వేషన్ కల్పించిన మొదటి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌కు గుర్తింపు ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న 123 పట్టణ స్థానిక సంస్థలలో 4 షెడ్యూల్డు తెగలకు, 17 షెడ్యూల్డు కులాలకు, 40 వెనుకబడిన తరగతులకు కేటాయించారు. ఆయా స్థానిక సంస్థలలో ఉన్న మొత్తం సీట్లలో-- రిజర్వేషన్లతో కూడా కలిపి 50 శాతానికి తగ్గకుండా మహిళలకు కేటాయించాలని నిబంధనలు చెబుతున్నాయి. అలాగే, నగర పంచాయతీలు, మునిసిపాలిటీలలో వార్డు మెంబర్లకు, నగరపాలక సంస్థలలో కార్పొరేటర్ల పదవులకు రొటేషన్ పద్ధతిన రిజర్వేషన్లు అమలవుతున్నాయి.ఆంధ్రప్రదేశ్ పురపాలక సంఘాల చట్టం--1965, సవరించిన ఆంధ్రప్రదేశ్ నగరపాలక సంస్థల చట్టం--1994 ప్రకారం... పట్టణ స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు అమలు చేయాలనే నిబంధనలు లేకపోయినా, 74వ, భారత రాజ్యాంగ సవరణ చట్టం 'ఆర్టికల్ 243--టి' ప్రకారం నగర పంచాయతీలు, పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థలలో ఆయా ప్రత్యేక వర్గాలకు రిజర్వేషన్లు కల్పించారు.ప్రస్తుతం జీవో 59, తేది 10.09.2021 ప్రకారం, రాష్ట్రంలోని నగర పంచాయతీలు, మున్సిపాలిటీలలో రిజర్వేషన్లు అమలు అవుతున్నాయి. అదే విధంగా జీవో 60, తేది 10.09.2021ని అనుసరించి ప్రస్తుతం నగరపాలక సంస్థలలో ఆయా కేటగిరీలకు చెందినవారికి రిజర్వేషన్లు కేటాయిస్తున్నారు. ఈ రిజర్వేషన్లు ఆయా వర్గాల జనాభాకు తగినట్లుగా దామాషా ప్రకారం రొటేషన్ పద్ధతిలో ఉండాలనీ, మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదనీ అమలులో ఉన్న ప్రభుత్వ ఉత్తర్వులు తెలియజేస్తున్నాయి.పట్టణ స్థానిక సంస్థలలో చైర్‌పర్సన్, మేయర్ పోస్టులకున్నట్టుగా వైస్ చైర్‌పర్సన్, డిప్యూటీ మేయర్ పోస్టులకు రిజర్వేషన్లు లేని కారణంగా, అసలు రిజర్వేషన్ పాలసీ అనే దానికే అర్థం లేకుండాపోతోంది. ఎందుకంటే-- ఏదైనా ఒక మున్సిపాలిటీలో చైర్‌పర్సన్ సీటు షెడ్యూల్డు కులాలకు కేటాయించినప్పుడు, ఏదైనా కారణంతో... అంటే చైర్‌పర్సన్ అనారోగ్యం లేదా పదవికి రాజీనామా చేయటం వంటి కారణాల వల్ల ఆ పదవికి తాత్కాలికంగా ఖాళీ ఏర్పడితే, ఆ పదవిలో కూర్చునే వ్యక్తి షెడ్యూల్డ్ కులానికి చెందిన వ్యక్తే అయివుండాలి. అలాగే, షెడ్యూల్డ్ తెగలకు, వెనుకబడిన కులాలకు, మహిళలకు కేటాయించిన చైర్‌పర్సన్ పోస్టుల విషయంలో కూడా, ఆయా పదవులకు తాత్కాలికంగా ఖాళీ ఏర్పడితే, ఆయా వర్గాలకు సంబంధించిన వ్యక్తులే ఆ పదవులను అలంకరించాలి. కానీ, వాస్తవ పరిస్థితులలో అలా జరగటం లేదురాష్ట్రంలో చాలా పట్టణ స్థానిక సంస్థలలో రిజర్వేషన్ విధానం సక్రమంగా అమలు జరగటం లేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీల స్థానంలో ఆయా వర్గాలకు చెందనివారు, మహిళల స్థానంలో పురుషులు అధికారం పంచుకుంటున్నారు. ఇది రాజ్యాంగం ప్రసాదించిన రిజర్వేషన్ స్ఫూర్తికి పూర్తి వ్యతిరేకం, ఆయా వర్గాల వారికి అన్యాయంగా భావించాల్సి ఉంటుంది.పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటకలలో చట్టాలను ఏనాడో సవరించుకున్న ఫలితంగా అక్కడ డిప్యూటీ మేయర్ పదవికి కూడా మేయర్ పదవికి చెందిన కేటగిరీ ననుసరించి రిజర్వేషన్ వర్తిస్తుంది. కానీ, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం పట్టణ స్థానిక సంస్థల చట్టాలు సవరణకు నోచుకోకపోవటంతో రిజర్వేషన్ స్ఫూర్తికి భంగం కలుగుతోంది. నిజానికి మన రాష్ట్రంలో కూడా 2021లో వైస్ చైర్‌పర్సన్, డిప్యూటీ మేయర్ పదవులకు రిజర్వేషన్ కల్పించే ప్రయత్నం జరిగింది. అయితే, ఆ రిజర్వేషన్లు ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా కాకుండా చట్ట సవరణ ద్వారానే జరగాలనే కారణంతో అప్పటి ప్రభుత్వం ఆ ప్రయత్నాన్ని విరమించుకుంది. అదే సంవత్సరం జూలైలో జారీ చేసిన జీవో 66 ద్వారా మున్సిపాలిటీలలో ఇద్దరు వైస్ చైర్‌పర్సన్‌లు, నగరపాలక సంస్థలలో ఇద్దరు డిప్యూటీ మేయర్లను ఎన్నుకుంటున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్న వైస్ చైర్‌పర్సన్, డిప్యూటీ మేయర్ పదవుల విషయంలో పైన తెలిపిన పరిస్థితులు మారి, ఆయా వర్గాలకు కేటాయించిన రిజర్వేషన్లు సక్రమంగా అమలు జరగాలంటే ప్రస్తుత చట్టాలను సవరించాలి. అప్పుడే రాజ్యాంగం ద్వారా షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు, వెనుకబడిన వర్గాల మహిళలకు ప్రత్యేకంగా కేటాయించిన రిజర్వేషన్లు పక్కాగా అమలు అవుతాయి. దీంతో రిజర్వేషన్ల వెనకున్న అసలు ఉద్దేశ్యం పూర్తిగా నెరవేరుతుంది.ఈ సంవత్సరాంతంలో జరగనున్న ఎన్నికలలోనైనా ప్రతి పట్టణ స్థానిక సంస్థలలోనూ రెండో అత్యున్నత ప్రజాప్రతినిధి పదవికి కూడా ప్రత్యేక రిజర్వేషన్‌ను అమలుచేసి, ఆయా వర్గాలకు సముచితమైన అవకాశాలు, ప్రాతినిధ్యం కల్పించాలి. అప్పుడే రాష్ట్రంలోని నగర పంచాయతీలు, పురపాలక సంఘాలు నగరపాలక సంస్థల పాలనా వ్యవస్థలను మరింత బలోపేతం చేయడం సాధ్యమవుతుంది.

# ఆరుద్ర మహాసముద్రం

క విత కోసమె నేను పుట్టాను, క్రాంతి కోసం కలం పట్టాను" అన్న ఆరుద్ర పుట్టింది 1925 ఆగస్టు 31. ప్రయోగ వాదిగా, అంత్య ప్రాసల ముద్ర ఆరుద్రగా పలు ప్రక్రియా వైవిధ్య సంభరితుడుగా, సినిమా కవిగా తెలుగు సాహిత్యంలో ఆరుద్ర ప్రత్యేక స్థానాన్ని పదిలపరచుకొన్నాడు.నీలాల నింగిలో ఎర్ర జెండా తోడ, విశ్వ వీణా రవపు విజయ గానమ్ముతో విజయ శంఖారావ విశ్వగీతమ్ముతో కొత్త మార్గాలపై, కొత్త మార్గాలకై కదలవే, కదలవే" అని బావుటా ఎగరేసి కవిత్వపు కాగడాను తన 17వ యేట 1942 లోనే పట్టి పురోగమించారు. ఆయన ఇంటరు మొదటి సంవత్సరం వరకే చదివారు. ఇంటరులో ఆయనకు ఇంగ్లీషు చెప్పిన గురువు రోణంకి అప్పలస్వామి. ఆరుద్ర తన 'త్వమేవాహం' కావ్యాన్ని వారికే అంకితమిచ్చారు. ఆరుద్ర 1948 జులై 10 తర్వాతే 'త్వమేవాహా'న్ని మొదలుపెట్టినప్పటికీ ప్రథమ ముద్రణ వెలువడింది జులై 1949. 'త్వమేవాహం' అప్పట్లో సంచలనం. నిజాముకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ పోరాటం నేపథ్యంగా రాయబడిన కావ్యమది. భాషలో ఆరుద్ర ప్రయోగాలు పాఠకులను అదిరిపాటుకు గురి చేశాయి. "బ్రెయిన్‌లో బ్రెన్ గన్, రెయిన్‌లా ఆలోచనల ట్రైన్, స్పయినల్ కార్డులో స్పెయిన్, గ్లూమీ తిమిరాలు చెరిషించి, సైతాను మనల్ని పరిషించునపుడు, నిర్వేదనా పవనాలు వర్షించు, బ్రెయిన్‌లో స్టెన్ గన్లా చెట్లూ చిట్టెలుకలు, చెయిన్సులో మగవాళ్లు, చెరచబడ్డ ఆడవాళ్లు, స్నో తెలుపు, ద్యూతెలుపు" -- ఇలా బుల్లెట్లలా పదాలు దూసుకొచ్చేసరికి ఆ ఇంగ్లీషు మాటల దూకుడు, ఆ ప్రతీకలు ఆనాటి పాఠకులకు కొరుకుడుపడక వింతగా చూశారు. ఆరుద్ర హృదయాంతర్గత వేదనను, మెదడులోని అలజడిని దాశరథి వివరించిన తరువాత కొంతమందికి అర్థమైంది. దాశరథి 'అగ్నిధార', సోమసుందర్ 'వజ్రాయుధం' రెండూ తెలంగాణా పోరాట నేపథ్యంలో 1949 లోనే వెలువడ్డాయి.

"మేధాశోధన నాళికలో కాలాన్ని పోసి, మండుతున్న గుండెల మీద మరగ బెడతాను. మానవాళికి పనికి వచ్చే ఫలితాల కోసం పాటుపడతాను, పాటకడతాను, కాలాన్ని పట్టి తెచ్చి రాటకేసి కట్టేస్తాను. కాలాన్ని మీకు బానిసగా చేస్తాను. కళ్లల్లో జ్యోతులు వెలిగిస్తాను. భూతల స్వర్గానికి తలుపులు తీస్తా"నని తన ఆకాంక్షను కావ్యారంభంలోనే చెప్పారు. కావ్యంలో ప్రతీకల ప్రయోగం అద్భుతం. కాలానికి సంకేతం గడియారం. గడియారం మన సంఘం. ఇసుక గడియారం, నీటి గడియారాలు పాత కాలపు సంఘాలు. గంటలు శ్రీమంతులు. నిముషాలు మధ్యతరగతి వాళ్లు. సెకండ్లు శ్రామికులు. చిన్నముల్లు శ్రీమంతుల మనస్తత్వానికి సూచి. పెద్దముల్లు మిడిల్ క్లాసు వాళ్ల భావాలకు బరామీటరు. సెకండ్ల ముల్లు శ్రామిక జనుల ఫిలాసఫీకి కొలబద్ద. స్టాప్ వాచి విప్లవాన్ని టైం చేసే సాధనం. పెండ్యులం నిలకడలేని ఊగిసలాట మనస్తత్వానికి ప్రతీక. 'కీ' విప్లవానికి ప్రోద్బలకారణం. కాలాన్ని ప్రవాహంగా కూడా భావించారు ఆరుద్ర. మృత్యువుతో పోరాడే తెలంగాణా పౌరుల చైతన్యంతో కవి 'త్వమేవాహ'మన్నాడీ కావ్యంలో. అంటే నువ్వేనేనని అభేదాన్ని చెప్పాడు. "ఈమె అయస్కాంతకాంత" అనే ఖండికలో పన్నెండు పాదాలు పన్నెండు అంకెలకు గుర్తు.పాదానికి ఐదక్షరాలు. ఒక అంకె నుండి ఒక అంకెకు రావటానికి పట్టే ఐదు సెకండ్లకు సూచిక. మొత్తం అరవై అక్షరాలు. అరవై సెకండ్లకు సంకేతంగా నిలుస్తాయి. ఇది గడుసైన శిల్పం. ఆరుద్ర 'టెక్నిక్' లేని కవిత్వాన్ని ఊహించలేనన్నాడు. కెప్టెన్‌ను తండేల్ అనటం, విమానాన్ని గాలిగెద్ద అనటం, డ్రెడ్జర్‌ను తవ్వోడ అనటం లాంటి పద ప్రయోగాలు ఉన్నాయి. దీనిలోనే ఛందః ప్రయోగాలూ ఉన్నాయి. వచన కవితలా సాగిస్తూ ఇది పద్యమే అని అనుమానం రాకుండా మత్తకోకిల, ఉత్సాహం, కవిరాజ విరాజితం, పృథ్వీవృత్తం, తరలం, మందారదామం, లయ గ్రాహి, దండకం, కందం లాంటివి పద్యాలు పేర్లు పెట్టకుండా రాశారు. కుందుర్తి 'నగరంలో వాన'లో కూడా ఇలా ఛందః ప్రయోగాలు చేశాడు. వచన కవిత్వమనే అభిప్రాయాన్ని కలిగించారు. ఛందస్సుల రహస్యం తెలిసిన వారే అలా



రాయగలరు. "ప్రజ భయపడకూడదు ఇల నిజం గెలుస్తుంది కనుక నీతి వెలుస్తుంది. జరామరణాలిక కల. ధ్వజం కొస నిరంతర సమధర్మం చూస్తాం". ఇది కందపద్యం -- దీనిలోని సందేశంతోనే 'త్వమేవాహం' ముగుస్తుంది.నిర్దేశించిన భావాలను వాక్యాలు బట్వాడా చేయలేవనుకున్నప్పుడు, ఆంగ్ల పదబంధాలను ఉపయోగించటానికి ఆరుద్ర వెనకాడలేదు. ఈ విధానం, ఆరుద్ర మరొక కావ్యం 'సినీవాలి' లోనూ కొనసాగింది. 'సినీవాలి' అంటే అమావాస్య నాడు కనపడే నెలవంక. ఇది నాలుగేళ్ల కొకసారి మాత్రమే కనిపిస్తుంది. చీకటిలో వెలుగు రేఖ ఉన్నట్లే కష్టాల్లో కూడా ఆశారేఖ ఉంటుందనే అర్థంలో కవి ఈ పదాన్ని గ్రహించాడు. డిగ్రీ చదువుకున్న మధ్యతరగతి యువకుడు సూర్యారావు ఉద్యోగాన్వేషణకు పట్టణానికి వెళ్తాడు. క్లర్కు ఉద్యోగం వస్తుంది. నగరంలో గుమస్తా బతుకు బాధలను నగర జీవనాన్ని ఈ కావ్యంలో ఆరుద్ర చిత్రించారు. పఠాభి 'ఫిడేలు రాగాల డజన్' కావ్యంలో నగర జీవన చిత్రణ ఆరుద్రకు స్ఫూర్తి. ఇందులో నాయకుడు మధ్యతరగతి యువకుడు. కలలబేరగాడు. ఇతడేమంటాడంటే-- "దావానల తుల్యోజ్వల భావానల కీలలోన పడుతూ ఉంటా, భావాలకు బానిసనై కావాలని గాలిమేడ కడుతూ ఉంటా"నంటాడు. ఇది కంద పద్యం. ఇలా ఆరుద్ర ఛందః ప్రయోగాలు చాలా ఉన్నాయి. 'సినీవాలి' కావ్యంలో నాటకీయత ఉంది. పాత్రలు సూర్యారావు, తండ్రి, ముగ్గురు వధువులు, కవి. సూర్యారావు, ఆ యువతులతో జరిపిన సంభాషణలు ఆలోచనాత్మకంగా ఉంటాయి. తండ్రి: "అబ్బాయీ! నీ చీకటి బ్రతుకులో పెళ్ళామనే పెట్రోమాక్సు లైట్ కావాలి. జీవితం రేడియో సెట్టుకి భర్త ఏరియల్, భార్య ఎర్త్" అంటాడు. "భార్యభర్తలనే ఏరియల్సు, ఎర్తు ఉన్నా ఏకాభిప్రాయమనే విద్యుచ్ఛక్తి లేకపోతే సెట్టు పలకటం సున్నా" అని అంటాడు అబ్బాయి. పాత్రల సంభాషణలు చమత్కారవంతంగా ఉంటాయి. పాత్రల ప్రవేశానికి మధ్య కవి వ్యాఖ్యానం ద్విపదల్లో ఉంది. "ఆర్జించుకొన్నట్టి ఆవేదనాగ్ని బూర్జువా సరదాల బూజు ధరించ" ఇలా కావ్యం మొత్తం మీద 61 ద్విపదలను రాశారు. అది ఆరుద్ర ప్రత్యేకత, జీవఫలం ప్రేమ -- అనేది ఈ కావ్యసందేశం -- కొంతమంది అనుకున్నట్లుగా ఈ కావ్యం విషాదాంతం కాదు. "అయ్యా! మృత్యువుగారూ! పిల్లవాణ్ణి దయచేసి కనికరించండి. లేమి కారుతోంది చూడండి. కలల పంచ నుండి కారే సంతృప్తి ధార, నిద్దుర బిందెలలో పట్టుకోనీయండి" -- అన్న వాక్యాలతో కావ్యం ముగుస్తుంది.

ఆరుద్ర 'కూనలమ్మ పదాలు'కు ఎన్నో అనుక రణలు వచ్చాయి. జనం నాలుకల మీద నాట్య మాడేవి చాలా ఉన్నాయి. "ఆశ పెరిగిననాడు, అహం పెరిగినవాడు తనకు తానే కీడు ఓ కూనలమ్మా! బ్రూటుకేసిన ఓటు, బురదలో గిరవాటు, కడకు తెచ్చును చేటు -- ఓ కూనలమ్మా! సగము క్యాపిటలిస్టు, సగము కమ్యూనిష్టు, ఎందు కొచ్చిన రొష్టు -- ఓ కూనలమ్మా!" అన్నారు. కవిత్వపరంగా ఇవికాక -- 'ఆరుద్ర రచన' (కవితలు) 1985 సంకలనం. విశాఖపట్నంపై 1942లో బాంబులు పడినప్పుడు 'మరణశాసనం' కవితలో, "కాలంకాగితమ్మై/ దివాకరుడు స్టాంపయితే/ నా దస్తావేజు మీద/ రేరాజే రాజముద్ర" అంటారు. ఆయన నాట్యశాస్త్రంపై రాసిన 'హస్తలక్షణ పదాలు' విశిష్టమైన రచన. ఇందులో భరత నాట్యంలో ముద్రలకు సంబంధించినవి ఆరుద్ర 31 హస్తలక్షణపదాలను చెప్పారు. వీటిలో ఆరుద్ర ముద్ర 'బాలగోపాల" అన్నది.నన్నయ్య, విశ్వనాథల మధ్యాక్కరలకంటే భిన్నంగా మంచి గమకంతో ఉండేట్లు మార్పు చేసి రాశారు ఆరుద్ర. వారు సవరించిన విశేషం వారి మాటల్లోనే: "భగణమ్మునై నొక్క లఘువుపాదుకొలుపును మంచి బిగువు (భల--చంద్రగణం)/ నగణమ్ముల ఘువులను రెండు నడకకై చేర్చుకొననిందు (నలల--చంద్రగణం)/ సొగసుగా ఇంద్రగణమందు చొప్పించుకో మాత్ర లైదు/ చిగురించ శుభలక్షణాలు చెప్పరా మధ్యాక్కరాలు" -- ఇదీ వారి మార్పు. ఇది వారి ప్రయోగం. భార్య రామలక్ష్మి మీద 'కే.రా త్రిశతి' పేరుతో మూడువందల కంద పద్యాలను రాశారు. నిమ్స్ ఆసుపత్రిలో కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్ అయినప్పుడు ఆరుద్ర ఐసియు బెడ్ మీద పడుకొనే వీటిని రాశారు.

'సమగ్రాంధ్ర సాహిత్యం' పుస్తకంలో ఆరుద్ర ప్రత్యేకత వ్యవహార శైలి. అలాగే అన్నమయ్య, త్యాగయ్య, క్షేత్రయ్య వేమనలను చేర్చి సాహిత్య చరిత్ర రాయటం. అంతకుముందు సాహిత్య చరిత్రల్లోకి ఈ కవులు ఎక్కలేదు. ఈ పరిశోధనలో శీర్షికలను చూస్తేనే దీని లోతును ఊహించవచ్చు. 'ఆరుద్ర వ్యాస పీఠం', 'గురజాడ గురుపీఠం', 'రాముడికి సీత ఏమవుతుంది?', 'వేమన్న వేదం'... ఇలా ఆరుద్ర రచనల పట్టికకే పేజీలు పడతాయి. ఆరుద్ర దృశ్య నాటికలలో 'శ్రీకృష్ణదేవ రాయ రూపవాణీ రూపకం'ను గుమ్మడి వగైరా నటులు ప్రదర్శించారు. హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్‌లో వరుసగా వందరోజులు ప్రదర్శింపబడింది. ఆరుద్ర కథలు, నాటికలు, నాటకాలు, డిటెక్టివ్ కథలు, డిటెక్టివ్ నవలలు చాలా ఉన్నాయి. 'ఆడదాని భార్య' ఆరుద్ర రాసిన అపురూపమైన డిటెక్టివ్ నవల.

ఇక ఆరుద్ర సినిమా పాటలూ వందల సంఖ్యలో ఉన్నాయి. మొదటిపాట, 'బీదలపాట్లు' (1972) సినిమాలో "ఓ చిలుక రాజా! లయ నీ పెళ్ళెప్పుడయ్యా!" అనేది. ఆరుద్ర రాసిన పెళ్లి పాటలు ఫేమస్. "పందిట్లో పెళ్లవుతున్నాదీ, కనువిందవుతున్నాదీ!", "శ్రీకారం చుట్టుకుంది పెండ్లి పుస్తకం, ఇక ఆకారం దాల్చనుంది కొత్త జీవితం" ఇది చివరిపాట. ఆరుద్రతో వ్యక్తిగతంగా నాకెంతో అనుబంధం ఉంది. ఈ జన్మదినం సందర్భంగా మరోసారి వారిని ఇలా తలచుకుంటూ ఈ అక్షర రూప నివాళి

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR


# అన్ని రంగాల్లో ఆర్యవైశ్యులు ముందంజలో ఉండాలి



సూర్యాపేట ఆగస్టు 31 వార్తా సాక్ష్యం

ఆధ్యాత్మిక, సామాజిక, వ్యాపార రంగాల్లో సైతం ఆర్యవైశ్యులు ముందుండాలని జిల్లా ఆర్యవైశ్య సంఘ ఉపాధ్యక్షులు కలకోట లక్ష్మయ్య తెలిపారు. సోమ వారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పాత వ్యవసాయ మార్కెట్ లో ఇటీవల కిరాణం ఫ్యాన్స్ అసోసియేషన్ ఎన్నికల్లో గెలుపొందిన వెంపటి రమేష్, పాలవరపు నరసింహారావు, చల్లా విశ్వనాథం లను ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కిరాణం అండ్ ఫాన్సీ అసోసియేషన్ లో అన్ని కులాల వారు ఉన్నప్పటికీని ఆర్య వైశ్యులను ఎన్నుకోవడం గుర్తించి ఘనంగా సన్మానించడం జరిగిందని తెలిపారు. ఏ ఎన్నికలు జరిగిన మన ఆర్యవైశ్యులు ముందంజలో ఉండాలన్నారు. నీతి నిజాయితీ తోటి అన్ని రంగాల్లో ఆర్యవైశ్యులు సేవలందిస్తున్నారని కొనియాడారు. యామా సంతోష్ కు సన్మానం తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ యువజన విభాగం సహాయ కార్యదర్శిగా ఇటీవల ఎన్నికై ప్రమాణ స్వీకారం చేసిన యామా సంతోష్ ను సైతం ఘనంగా సన్మానించారు. ఈ కార్య క్రమంలో నాయకులు పోతుగంటి వెంకటేశ్వర్లు, తప్పి గాంధీ, దేవరశెట్టి సత్యనారాయణ, చల్లా సత్యనారాయణ (కిరాణా), బచ్చు పురుషోత్తం,ఓరుగంటి రామ్మూర్తి, తేలుకుంట్ల జగన్, మంచాల శ్రీనివాస్ గుప్త శ్రీరంగం రాము, బెలిదె ముకుందం, తల్లాడ శ్రీనివాస్, బూర్లేరామ్మూర్తి కొండ రమేష్, పబ్బతి ప్రవీణ్ కుమార్, ప్రతాపని చక్రధర్, చిత్తలూరు శ్రీధర్ యామ సంతోష్, ప్రొద్దుటూరి నాగ ప్రసాద్ ,తడివిడి శెట్టి కృష్ణకుమార్ బెలిదే రాజేష్, బెలిదే శ్రీను(బంక్ ) , తప్పి అనిల్ కుమార్,ఉప్పలంచు కృష్ణ, వంగవీటి రమేష్, నవిలిపురి నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గంలో క్రీడాకారులకు అన్ని విధాలుగా సహకరిస్తా





-శ్రీశైల నియోజకవర్గంఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

ఆత్మకూరు ఆగస్టు 31 వార్త సాక్ష్యం

శ్రీశైల నియోజకవర్గశీ క్రీడాకారులకు అన్ని విధాలుగా సహకరిస్తానని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి తెలిపారు. సోమవారం ఎమ్మెల్యే నివాసంలో ఇటీవలే తిరుపతి పట్టణంలో జరిగిన అమరావతి ఛాంపియన్షిప్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ఆత్మకూరు ఎన్టీఆర్ కేవీకే స్టేడియం తరపున బాక్సింగ్ క్రీడాకారులు పాల్గొని రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానము పొందడం జరిగింది. అందరు సెవెంటీన్ విభాగంలో చిరంజీవి, మోహన కృష్ణ సాయి, ఇద్దరు సిల్వర్ మెడల్స్ సాధించడం సాధించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి క్రీడాకారులను మెడల్స్ తో అభినందించి, గెలుపొందిన ధృవీకరణ పత్రాలు అందచేసి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఆత్మకూరు పట్టణంలో కెవికె స్టేడియం లో శిక్షణ తీసుకొనే క్రీడాకారులు ప్రతి క్రీడలో ప్రతిభ చూపించి నియోజకవర్గానికి మంచి పేరు తేవాలని తెలిపారు. స్టేడియం లో క్రీడాకారులకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. స్టేడి యం లో క్రీడాకారులకు శిక్షకులచే మెలకువలు నేర్పి మంచి ఫలితాలు సాధించేలా చేస్తున్నా స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా ను అభినందించారు. క్రీడాకారులకు జిల్లా స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి లో పాల్గొనేలా అందరూ కష్టపడాలని సూచించారు. చదువుతో పాటు క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొనాలన్నారు. ప్రతి ఒక్కరు చదువుతో పాటు క్రీడల్లో రాణించి దేశానికి మంచి పేరు తేవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. మెడల్స్ సాధించేలా కృషిచేసిన స్టేడియం బాక్సింగ్ శిక్షకులు ఉపేంద్రను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్టేడియం ఖోఖో శిక్షకులు మహేబూబ్ తదితరులు పాల్గొన్నారు.

# కర్నూలు జిల్లాలో టిడిపి పార్టీ ఇంచార్జి గౌరు వెంకటరెడ్డి జన్మదిన వేడుకలు





-టిడిపి పార్టీలో సంబరాలతో తెలుగు తమ్ముళ్లు
-ప్రత్యేక అభినందనలు తెలియజేసిన టిడిపి పార్టీ నంద్యాల పార్లమెంట్ ఇన్చార్జి మాండ్ర శివానందరెడ్డి

కర్నూలు,ఆగస్టు31 వార్త సాక్ష్యం

నందికొట్కూరు నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ గౌరు.వెంకట రెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా సోమవారం కర్నూలు పట్టణంలోని, ఆయన స్వగృహంలో నంద్యాల పార్లమెంట్ టిడిపి ఇంచార్జ్ మాండ్ర.శివానంద రెడ్డి, ఆయన సతీమణి మాండ్ర.ఉమాదేవి, తో పాటు మండల కన్వీనర్ మాండ్ర.సురేంద్రనాథ్ రెడ్డి, లు మర్యాద పూర్వకంగా కలిసి, జన్మదిన శుభాకాంక్షలు, తెలియజేశారు. ఈ సందర్భంగా మాండ్ర. శివానం దరెడ్డి, మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలో కీలక రాజకీయాలు చేసి ఎంతోమందికి ఆదర్శంగా నిలిచిన ప్రజా అధినేత గౌరు వెంకటరెడ్డి అని అన్నారు ఇటువంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకో వాలని, ఆయనకి మంచి ఆయురారోగ్యాలు ఇవ్వాల ని, వారి కుటుంబం సుఖసంతోషాలతో కలకాలం జీవించాలని మనస్ఫూ ర్తిగా ఆ దేవున్నీ కోరుకుంటూ ఆకాం క్షించారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు నియోజ కవర్గం నాయకులు మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం. ప్రసాద్ రెడ్డి, మాండ్ర శివానందరెడ్డి పిఏ,మద్దిలేటి, కొత్తపల్లి మండల కన్వీనర్ లింగస్వామి గౌడ్, మండల నాయకులు నారపురెడ్డి, తదితర పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

సూర్యాపేట ఆగస్టు 31 వార్త సాక్ష్యం

శాంతి భద్రతల పరిరక్షణ దృశ్య, జిల్లాలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా, జిల్లాలో ఉన్న ప్రశాంత వాతావరణం భంగం కాకుండా, సవ్యంగా కొనసాగించడానికి సెప్టెంబర్ ఒకటి వ తేదీ నుండి 30వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ ఆక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ నరసింహ తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ 30 పోలీస్ ఆక్ట్ అమల్లో ఉన్నందున జిల్లాలో డిఎస్పి లేదా ఆ పై స్థాయి అధికారుల నుండి ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ప్రజా సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమి గుడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించరాదని మరియు సన్నాహాలు చేయరాదని తెలిపారు. నిషేధిత ఆయుధాలు, కత్తులు, కర్రలు, దుడ్డు కర్రలు, తుపాకులు, పేలుడు పదార్థాలు, దురుద్దేశంతో నేరాలను ఉసిగొలి పేటువంటి ఆయుధాలు కలిగి ఉండరాదని తెలిపారు. ప్రజా జీవనానికి ఇబ్బంది దారి తీసే ప్రజా సమా వేశాలు, జన సమూహం లాంటివి పూర్తిగా నిషేధిం చబడ్డాయని తెలిపారు. అధిక శబ్దం వచ్చే స్పీకర్లు, డీజేలు వంటివి వాటికి అనుమతులు లేవని తెలిపారు. ప్రచార రథాలు, మైకులు, తదితర అధిక శబ్దం పరికరాలు నిషేధించబడ్డాయని సూచించారు. చట్ట ప్రకారం జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే 30 పోలీస్ ఆక్ట్ ప్రకారం చట్టపరమైన చర్యలకు తప్పవు అని సూచించారు. నిబంధనలను తప్పనిసరిగా ప్రతి ఒక్కరు పాటించాలని తెలిపారు. ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న ముందస్తుగా దరఖాస్తు చేసుకొని అనుమతులను పొందాలని సూచించారు.



# సక్రమంగా పనులు నిర్వర్తించిన తహసీల్దార్



వెలుగోడు ఆగస్టు 31 వార్త సాక్ష్యం

రెవిన్యూ లో ఎన్నో కష్టానష్టాలు వచ్చినా, పనిలో నిక్కచ్చిగా వెలుగోడు తహసీల్దార్ గా శ్రీనివాసులు గౌడ్ పనిచేసారని రెవిన్యూ డివిజనల్ అధికారి వెంకట శివ , ఎపి రెవిన్యూ జెఏసి అధ్యక్షులు రామచంద్రయ్య పేర్కొన్నారు. సోమవారం వెలుగోడు తహసీల్దార్ గా పదవి విరమణ చేసిన శ్రీనివాసులు గౌడ్ సన్మానం కార్యక్రమం పట్టణంలోని ఎస్. ఆర్ ఫంక్షన్ హాలు లో ఆర్డీఓ అధ్యక్షతన ఘనంగా జరిగింది. 1987 లో టైపిస్ట్ గా ఉయ్యాలవాడ జాయినింగ్ అయి ,గోస్పాడు ,నంద్యాల తదితర ప్రాంతాల్లో టైపిస్ట్,సీనియర్ అసిస్టెంట్ , డిప్యూటీ తహసీల్దార్, తహసీల్దార్ గా 39 సంవత్సరాలు రెవిన్యూ శాఖ లో పని చేశారు.
ప్రతి ఉద్యోగి జీవితం లో పదవి విరమణ తప్పనిసరి. రెవిన్యూ లో భూ సమస్యలు ఒకరికి న్యాయం జరిగితే మరొకరికి అన్యాయం జరుగు తుంది. దింతో చాలా తలనొప్పులు వస్తాయి. ఈ కార్యక్రమం లో రిటైర్డ్ ఎంపిడిఓ మధు సూదన రెడ్డి , మాజీ ఎంపిపి అంబాలా రామసు బ్బారెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ సుధాకర్ రెడ్డి. రిటైర్డ్ ఏ. ఓ శ్రీనివా సులు ,రిటైర్డ్ తహసీల్దార్ శ్రీనివాసులు, మాజీ ఎంపిపి ఎల్లాల కృష్ణుడు , జూపా డుబంగ్లా తహసీల్దార్ చంద్ర శేఖర్ నాయక్ , నందికొట్కూరు తహసీల్దార్ వెంకటేశ్వర్లు , ఆత్మకూరు తహసీల్దార్ రత్నరాధిక,కొత్తపల్లి తహసీల్దార్ ఉమారాణి , పాములపాడు ,బండి ఆత్మకూరు , శ్రీశైలం తహసీల్దార్ లు టిడిపి నాయకులు,రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# జీవన జ్యోతి బీమాతో భరోసా




కర్లపాలెం ఆగష్టు 31 వార్తసాక్ష్యం

ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన పథకం బ్యాంకు ఖాతాదారులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని కర్లపాలెం యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ బి. తిరుపతమ్మ తెలిపారు. మండల పరిధిలోని గణపవరం గ్రామానికి చెందిన అంకిరెడ్డి పెద్ద అంకమ్మరావు ఇటీవల మృతి చెందారు. ఆయన బ్యాంకు ఖాతాకు నామినీగా ఉన్న భార్య అంకిరెడ్డి వెంకటేశ్వరమ్మకు ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన పథకం కింద మంజూరైన బీమా మొత్తాన్ని సోమవారం అందజేశారు. మృతుడి కుటుంబానికి అవసరమైన ధ్రువపత్రాల పరిశీలన అనంతరం కేవలం వారం రోజుల్లోనే క్లెయిమ్ పరిష్కరించినట్లు మేనేజర్ తెలిపారు. ఈ సందర్భంగా తిరుపతమ్మ మాట్లాడుతూ ప్రతి బ్యాంకు ఖాతాదారుడు ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనుకోని పరిస్థితుల్లో ఖాతాదారుడు మృతి చెందినప్పుడు నామినీకి బీమా ప్రయోజనం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కర్లపాలెం శాఖ ఖాతాదారులందరూ ఈ పథకంపై అవగాహన పెంచుకుని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

# భక్తిగాయకుడికి ఘన సన్మానం



కర్లపాలెం ఆగష్టు 31 వార్తసాక్ష్యం

ఇటీవల విడుదలై ఘన విజయం సాధించిన ఇరుముడి చిత్రంలో అయ్యప్ప స్వామిపై భక్తిగీతం ఆలపించిన ప్రముఖ గాయకుడు డప్పు శీను స్వామిని సోమవారం కర్లపాలెం జడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్ రెడ్డి ఘనంగా సన్మానించారు. కర్లపాలెంలోని గాయకుడు కొండల స్వామి ("రఘుకుల తిలకా రారా") నూతన గృహప్రవేశ కార్యక్రమానికి డప్పు శీను స్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా కర్లపాలెం వాసులు ఆయనను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఇరుముడి చిత్రంలో అయ్యప్ప స్వామిపై ఆయన ఆలపించిన భక్తిగీతం విశేష ఆదరణ పొందడంతో పలువురు శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని భక్తిగీతాలు ఆలపించి ప్రేక్షకులను అలరించాలని ఆకాంక్షి ంచారు. అనంతరం శాలువాతో డప్పు శీను స్వామిని ఘనంగా సన్మాని ంచారు. కార్యక్రమంలో కుమారస్వామి, ఎన్.వి. స్వామి, 'అందరివాడు' అట్ల హరిబాబు రెడ్డి తదితర కర్లపాలెం వాసులు పాల్గొన్నారు.

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



## చెరుకూరులో గ్రోమోర్ కేంద్రం ప్రారంభం



చెరుకూరు ఆగష్టు 31 వార్తసాక్ష్యం

కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో చెరుకూరు గ్రామంలో నూతన గ్రోమోర్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులకు గ్రోమోర్ ఉత్పత్తులు, ఎరువులు, పురుగుమందులు, పశువుల దాణా, వ్యవసాయ పనిముట్లతో పాటు సంస్థ అందిస్తున్న సేవలను అధికారులు వివరించారు.కార్యక్రమంలో గ్రోమోర్ ఒంగోలు జోనల్ మేనేజర్ కోడె వికాస్, జోనల్ మార్కెటింగ్ మేనేజర్ సుధాకిరణ్, ఏరియా ఆపరేషన్ మేనేజర్ రాజేష్, ఏరియా మార్కెటింగ్ మేనేజర్ చెన్నాచారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రైతులు ముందుగా భూసార పరీక్షలు చేయించుకుని, పరీక్షల ఫలితాలకు అనుగుణంగా ఎరువులు, పురుగుమందులను వినియోగించాలని సూచించారు. తద్వారా పంట దిగుబడితో పాటు భూసారం పరిరక్షణకు దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో చెరుకూరు గ్రామానికి చెందిన పలువురు రైతులు పాల్గొని, గ్రామంలో గ్రోమోర్ కేంద్రం ఏర్పాటు చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

## డిజిటల్ సేవలకు కొత్త కేంద్రం



కర్లపాలెం ఆగష్టు 31 వార్తసాక్ష్యం

పెదగొల్లపాలెం గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ, ఆన్‌లైన్, డిజిటల్ సేవలను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో పెదగొల్లపాలెం మెయిన్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన జై జోగులాంబ సీఎస్సీ డిజిటల్ సేవా కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు.మాజీ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ నక్కల వెంకటస్వామి ఉదయం 10.51 గంటలకు రిబ్బన్ కట్ చేసి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు తోట వీర బ్రహ్మం మాట్లాడుతూ గ్రామ ప్రజలకు అవసరమైన వివిధ ప్రభుత్వ సేవలు, ఆన్‌లైన్, డిజిటల్ సేవలను ఒకే చోట అందుబాటులోకి తీసుకు రావడమే కేంద్రం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజలు ఈ సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో పెద్దగొల్లపాలెం గ్రామ పార్టీ అధ్యక్షుడు పమిడి రవీంద్ర, చింతయపాలెం సొసైటీ చైర్మన్ మద్దిబోయిన తిరుపతయ్య (బులియ్య), నక్కల ప్రసాద్, పందరబోయిన శ్రీనివాసరావు, బోయిన వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు, నాయకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## విద్యార్థులకు శక్తి యాప్‌పై అవగాహన




ఇంకొల్లు ఆగష్టు 31 వార్తసాక్ష్యం

విద్యార్థినీ విద్యార్థులకు మహిళా రక్షణ, సైబర్ నేరాలు, బాలల భద్రతపై అవగాహన కల్పించేందుకు పావులూరు జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామ హేశ్వర్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, చీరాల డీఎస్పీ మోయిన్ సూచ నలతో ఇంకొల్లు సీఐ రామానాయక్, ఎస్సై సురేష్ పర్యవేక్షణలో చీరాల సబ్‌డివిజన్ శక్తి బృందం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది.శక్తి బృందం కానిస్టేబుల్ కే. సుబ్బారావు విద్యార్థులకు శక్తి యాప్ ఉపయో గాలు వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో మహిళలు తక్షణ సహాయం పొందేందుకు ఈ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈవ్‌టీజింగ్, బాల్య వివాహాలను అరికట్టడంలోనూ యాప్ ద్వారా సహాయం పొందవచ్చని వివరించారు.అలాగే గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పిస్తూ ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే వెంటనే తల్లిదం డ్రులు, ఉపాధ్యాయులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సోషల్ మీడియాలో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ తదితర వేదికల్లో వచ్చే ఫేక్ న్యూస్, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. సమస్యలు ఎదురైనప్పుడు 100, 112, 181, 1091, 1098 హెల్ప్‌లైన్ నంబర్లను సంప్రదించాలని తెలిపారు.ఫోక్సో చట్టం, బాలలపై లైంగిక వేధింపుల నివారణ, మహిళల రక్షణ కోసం స్వీయ రక్షణ పద్ధతులపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మేరికనపల్లి సత్యనారాయణ, ఉపాధ్యాయులు, శక్తి బృందం సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యకు ప్రాధాన్యత -అభివృద్ధికి పెద్దపీట







**-నందికొట్కూరు నియోజకవర్గం ఎమ్మెల్యే గిత్త.జయసూర్య**

పాములపాడు,ఆగస్టు 31, వార్త సాక్ష్యం

సోమవారం మండల పరిధిలోని రుద్రవరం గ్రామంలో నూతనంగా నిర్మించబోయే పాఠశాల భవనానికి నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త. జయసూర్య, ప్రభుత్వ అధికారులతో, నాయకులతో కలిసి భూమి పూజ నిర్వహించి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించి, నాణ్యమైన విద్యకు అనుకూలమైన వాతా వరణం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.అనంతరం ఎమ్మెల్యే కు ఆరోగ్య ఉప కేంద్రానికి స్థలాన్ని కేటాయించాలని కోరుతూ హెల్త్ సూపర్వైజర్ రత్నమ్మ, ఎమ్ ఎల్ హెచ్.పి- కే.జీ.మమత, ఏఎన్ఎం కే.కృష్ణవేణమ్మ, ఆశ వర్కర్లు ఎం.లక్ష్మీదేవి, కే.సుధారాణి లు వినతి పత్రం అందజేశారు

**-ఇంటింటికి కూటమి ప్రభుత్వం రెండేళ్ల సంక్షేమ పాలన కార్యక్రమం**

రుద్రవరం గ్రామంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త.జయసూర్య, ప్రభుత్వ అధికారులతో, నాయకులతో కలిసి ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రజాహిత సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో నందికొట్కూరు నియోజవర్గ టిడిపి అబ్జర్వర్ జి.వెంకట శివుడు యాదవ్, టిడిపి మండల కన్వీనర్ రవీంద్రారెడ్డి, భానుముక్కల బండ్లమూరి వెంకటేశ్వరరావు, మద్దూరు జి.తిమ్మరెడ్డి , ఎర్ర గూడూరు చెల్లె. హరినాథ్ రెడ్డి, శివ శంకర స్వామి, పాములపాడు సొసైటీ చైర్మన్ సి.గోవిందు, ఎంపీటీసీ రాచపూడి అరుణ, తెలుగు యువత మండల అధ్యక్షుడు షేక్.కరీం భాషా, నాయకులు రాచపూడి సురేష్ (అడ్వకేట్), టిడిపి బీసీ సెల్ మండల అధ్యక్షుడు కంభం.మోహన్ గౌడు, టిడిపి మండల కల్చరల్ అధ్యక్షుడు భావన వినోద్ కుమార్, జూటూరు హాఫీజ్, నాయిని కృష్ణ, రుద్రవరం మధుసూదన్ రెడ్డి, స్కూల్ కమిటీ చైర్మన్ కరిముల్లా, నాగయ్య, శ్రీనివాసులు, చిన్న వెంకటసుబ్బయ్య, షాలు, అల్లా బకాష్, నాగరాజు, రవీంద్ర, నరేష్, గోవిందు, చిన్న బాబుసా, ఇంతియాజ్, షేక్.రఫీ, షేక్.హుస్సేనాలం, ఉస్మాన్ భాష, మహబూబ్ బాషా, రహంతుల్లా, వాజిద్, రమణయ్య, ప్రభుత్వ అధికారులు ఎంఈఓ-1 బాలాజీ నాయక్, తహసిల్దార్ జి.సుభద్రమ్మ, ఎస్ఐ- పి.తిరుపాలు, ఇన్చార్జి ఎంపీడీవో- సులోచన, విబిజి రాంజీ పథకం ఏపీఓ- బి.జయంతి, ఐకెపి ఎపిఎం- ఏ. ఉమామహేశ్వరి, ఆర్డబ్ల్యూఎస్ జేఈ-సువర్చల, రెవెన్యూ ఇన్స్పెక్టర్ డి.ఖాజాబీ, ఎమ్మెల్యే గవర్నమెంట్ పిఏ- రవీంద్ర, కానిస్టేబుళ్లు ఎం.టావేశ్వరుడు, ఎన్.ఎం.కె.చౌదరి, ప్రభుత్వ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు

## వెలుగోడులో అనుమతులు లేకుండా 'చలో తెలుగు గంగ' నిర్వహిస్తే చర్యలు

**-ట్రాక్టర్ యజమానులకు,నాయకులకు ముందస్తు నోటీసులు :**

**-చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**

**- వెలుగోడు ఎస్ఐ, బి. సురేష్**

వెలుగోడు ఆగస్టు 31 వార్త సాక్ష్యం

రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ వైసీపీ ఆధ్వర్యంలో నేడు నిర్వహించనున్న 'చలో తెలుగు గంగ' కార్యక్రమానికి ఎలాంటి అనుమతులు లేవని వెలుగోడు మండల ఎస్సై బి. సురేష్ తెలిపారు. అనుమతులు లేకుండా ర్యాలీలు, ఆందోళనలు నిర్వహించి చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. సోమవారం వెలుగోడులో విలేకరులతో మాట్లాడిన ఎస్సై ఈ మేరకు వివరాలు వెల్లడించారు.వైసీపీ ఆధ్వర్యంలో సుమారు 500 ట్రాక్టర్లతో రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ తెలుగు గంగ ప్రాజెక్టును ముట్టడించే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సమాచారం ఉందన్నారు. అయితే ఈ కార్యక్రమానికి పోలీసుల నుంచి ఎలాంటి అనుమతి ఇవ్వలేదని స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా పెద్ద సంఖ్యలో ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహిం చడం, ప్రాజెక్టు వద్దకు వెళ్లి ముట్టడికి ప్రయత్ని ంచడం, ప్రజలకు మరియు వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలిగించడం చట్టవి రుద్ధమని పేర్కొన్నారు.ప్రస్తుతం మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతు న్నారని ఎస్సై తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కార్యక్రమానికి సంబంధించిన నాయకులు, ట్రాక్టర్ యజమానులకు ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. నోటీసులు అందుకున్న వారు పోలీసుల సూచనలు, చట్టపరమైన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రజాస్వామ్య పద్ధతుల్లో కార్యక్రమాలు నిర్వహించడంపై తమకు అభ్యంతరం లేదని, అయితే ప్రజల భద్రతకు భంగం కలిగించేలా , అనుమతులు లేకుండా భారీ ర్యాలీలు, ముట్టడి కార్యక్రమాలు నిర్వహించడాన్ని అనుమతించబోమని ఎస్సై పేర్కొన్నారు. ముఖ్యంగా వందల సంఖ్యలో ట్రాక్టర్లు ఒకేసారి రోడ్లపైకి వస్తే ట్రాఫిక్ సమస్యలు ఏర్పడే అవకాశం ఉందని, అత్యవసర వాహనాల రాకపో కలకు అంతరాయం కలిగే ప్రమాదం ఉందన్నారు. తెలుగు గంగ ప్రాజెక్టు పరిధిలోకి అనుమతులు లేకుండా ప్రవేశించడం, అధికారుల విధులకు ఆటంకం కలిగించడం, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించడం లేదా ఇతర చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పాల్గొనే ప్రతి ఒక్కరూ పరిస్థితిని అర్థం చేసుకుని పోలీసులకు సహకరిం చాలని కోరారు. ముందస్తు నోటీసులు ఇచ్చినప్పటికీ నిబంధనలు ఉల్లంఘించి కార్యక్రమంలో పాల్గొంటే బాధ్యులపై



చర్యలు తప్పవని ఎస్సై బి. సురేష్ స్పష్టం చేశారు. ట్రాక్టర్ యజమానులు తమ వాహనాలను అనుమతి లేని ర్యాలీలకు తీసుకెళ్లకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. అలాగే వైసీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు ఎలాంటి ఉద్రిక్తతలకు తావులేకుండా శాంతి యుతంగా వ్యవహ రించాలని కోరారు.మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి చర్యలనూ ఉపేక్షించబోమని ఎస్సై తెలిపారు. చట్టాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని, అనుమతులు లేకుండా నిర్వహించే కార్యక్రమాలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే పోలీసుల ప్రధాన బాధ్యత అని, అందులో భాగంగానే ముందస్తు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. రైతులకు సాగునీరు అందించాలనే డిమాండ్‌పై రాజకీయ పార్టీలు, రైతు సంఘాలు తమ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లా లని, అయితే చట్టపరమైన నిబంధనలను ఉల్లంఘిం చకుండా కార్యక్రమాలు నిర్వహించుకోవాలని ఎస్సై సూచించారు.

## ఘనంగా ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ జన్మదిన వేడుకలు






కర్నూలు ఆగస్టు 31 వార్త సాక్ష్యం

కాంకర్ ఒకేషనల్ కాలేజీ అధినేత కొంకతి వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సోమవారం 'మన వృద్ధుల ఆశ్రమం' నందు ఆశ్రమవాసులకు పండ్లు, ఉచిత భోజన వసతి అన్నదానంఏర్పాటు చేశారు. ఈ సేవా కార్యక్రమంలో కర్నూలు ఈగల్ ఎస్సై రమేష్ నాయక్, గ్రామ జ్యోతి సీఈవో నారాయణ, ఈగల్ టీమ్ సభ్యులు, పాల్గొని వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. సమాజసేవే ధ్యేయంగా పనిచేసే ఆకే రవికృష్ణ జన్మదినాన్ని ఇలాంటి మంచి కార్యక్రమంతో జరుపుకోవడం అభినందనీయమని ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలేజీ సిబ్బంది, పలువురు ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ భూములు నిరుపేదలకు పంచాలి





-అఖిల భారత రైతు కూలీ సంఘం డిమాండ్

ఆత్మకూరు ఆగస్టు 31 వార్త సాక్ష్యం

ప్రభుత్వ భూములు నిరుపేదలకు పంచాలని అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆర్డిఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ఏవో మంజుల రెడ్డి కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది . ఈ కార్యక్రమానికి అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కోశాధికారి కే లాలూ నాయక్ అధ్యక్షత వహించారు ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు వై నరసింహులు మాట్లాడుతూ వెలుగోడు గ్రామము గుంతకందల గ్రామము మరియు మండలంలోని వివిధ గ్రామాలలో భూమిలేని పేదలు కూలి మీద ఆధారపడి కూలీ డబ్బులతో వారి కుటుంబాలు పోసినకు సరిపోక దుర్భర జీవితాలు అనుభవిస్తున్నారు. మరికొందరికి ఇల్లు లేక బాడుగ ఇంటికి అద్య కట్టలేక జీవిస్తున్నారు భూమిలేని పేదలకు భూమి ఇవ్వాలని ఇల్లు లేని వారికి ఇంటి స్థలం ఇచ్చి పక్క గృహాలు నిర్మించి ఇవ్వాలని ప్రతి ప్రభుత్వ కార్యక్రమాల్లో అర్జీలు ఇచ్చిన పేదల సమస్యలు నేటికి పరిష్కరించలేదన్నారు వారి జీవితాలతో ఎలాంటి మార్పు లేదు నాటి నుండి నేటి అధికారంలో ఉన్న ప్రభుత్వాలు భూమిలేని పేదలకు భూములు పంపించేస్తామని భూ సంస్కరణల చట్ట ప్రకారం ప్రభుత్వ భూములు పేదల కేటాయిస్తామని చెప్పడం జరుగుతుంది తప్ప కాని 2012 నుంచి నేటి వరకు ఎక్కడ కూడా అసైన్మెంట్ కమిటీలు జరగలేదు పేదలకు భూములు ఇవ్వలేదు కానీ ప్రభుత్వ భూములు పెత్తందారులకు మరియు పలుకుబడి ఉన్న వారికి మాత్రమే ఎటువంటి కమిటీలు లేకుండా వారికి అక్రమ మార్గంలో భూములు ఇచ్చినట్టు తెలుస్తుందన్నారు . పైగా పేదలకు ప్రభుత్వం ఇవ్వమ ంటే ప్రభుత్వ భూములు లేనట్టు మండల అధికారులు చెప్తున్నారు. కావున వెలుగోడు గ్రామంలో సర్వేనెంబర్ 1706లో విస్తీర్ణం 333-59 ఎకరాలు ప్రభుత్వ భూములు మిగిలి ఉన్నాయి అని రెవెన్యూ రికార్డులో ఉన్నది కానీ వీటిలో కొంత భూమిని కొందరు భూములు ఉన్నవారు ఆక్రమించుకున్నట్లు తెలిసింది కావున ఆక్రమించుకున్న వారి నుండి ప్రభుత్వం భూములను స్వాధీనం చేసుకోవాలి అదేవిధంగా గుంతకందల గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూములు గ్రామానికి ఎటువంటి సంబంధం లేని ఇతర గ్రామాల వారు ఆక్రమించుకున్నట్లు తెలిసింది అక్రమ దారుల నుండి ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకోవాలి 1997 .98లో అబ్దుల్లాపురం గ్రామంలో జరిగిన అసైన్మెంట్ కమిటీలో భూ పంపిణి పై విచారణ చేపట్టాలన్నారు .మరియు ప్రభుత్వం నిర్వహించినటువంటి భూ సర్వేలో బయటపడ్డ ప్రభుత్వ భూములను మొత్తం కూడా నిరుపేదలకు కుటుంబానికి రెండు ఎకరంలో చొప్పున భూమిని పంపిణీ చేయాలన్నారు . అదేవిధంగా ఇంటి స్థలం లేని వారికి ఇంటి స్థలం ఇచ్చే ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఐదు లక్షల కేటాయించి ఇల్లు నిర్మిం చాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు .ప్రజల కు భూమి ఇంటి స్థలాలు పక్కా గృహాలు ఇవ్వని పక్షంలో మరింత పోరాటాలకు ప్రజలను సిద్ధం చేస్తామని ఆయన హెచ్చరించారు .ఈ కార్యక్రమంలో అఖిలభారత రైతు కూలి సంఘం జిల్లా సహాయ కార్య దర్శి కే ఆనందరావు. వెలుగోడు మండల అధ్యక్షులు ఎన్ విజయ్. కార్యదర్శి షేక్ వడ్ల హుస్సేన్. మరియు శివమ్మ. ఆర్ శాంతి. విజయ లక్ష్మి. అత్తరు మున్నీసా .బి కళ్యాణి .వెంకటే శ్వరమ్మ. నారాయణమ్మ, మహిళలు తదితరులు పాల్గొన్నారు

## బకాయిల కోసం ఉద్యోగుల పోరుబాట



బాపట్లఆగష్టు 31 వార్తసాక్ష్యం

ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని, తమకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏపీజేఏసీ అమరావతి ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘాల నాయకులు ఉద్యమ బాట పట్టారు. ఇందులో భాగంగా సోమవారం వందలాది మంది ఉద్యోగులతో కలిసి బాపట్ల జిల్లా కలెక్టర్ డా. వి. వినోద్ కుమార్, ఐఏఎస్‌కు ఉద్యమ కార్యాచరణ నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా జేఏసీ అమరావతి చైర్మన్ సి. హెచ్. సురేష్‌బాబు మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు, ఆర్థిక ప్రయోజనాలను చెల్లించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే సంఘాల నాయకులపై విమర్శలు చేయడం వల్ల సమస్యలు పరిష్కారం కావని పేర్కొన్నారు. ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో ప్రభుత్వం చర్చలు జరిపి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఉద్యోగులు ప్రభుత్వాన్ని గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని, “మా డబ్బులు మాకు ఇవ్వండి” అని మాత్రమే అడుగుతున్నామని స్పష్టం చేశారు. ఉద్యోగుల ఆర్థిక, సేవా సంబంధిత సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి స్పందించని పక్షంలో ఉద్యమ కార్యాచరణను కొనసాగిస్తామని నాయకులు తెలిపారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టనున్న తదుపరి కార్యాచరణలో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా మహిళా విభాగం చైర్‌పర్సన్ పి. రజిని, కార్యదర్శి షేక్ హాజరాబేగం, జేఏసీ కో-చైర్మన్లు బి. ఓంకార్, కె. మురళీమోహన్ రెడ్డి, డి. శ్రీకాంత్, హెడ్‌మాస్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఏ. కృష్ణారావు, ఆర్‌డబ్ల్యూఎస్ డిపార్ట్‌మెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఆర్. శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బత్తుల బ్రహ్మారెడ్డి, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు పి. రమేష్, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి. పెంచలయ్య, పి. కమలాకర్, వెటర్నరీ డిపార్ట్‌మెంట్ సంఘం జిల్లా అధ్యక్షులు రాజేంద్రప్రసాద్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి యు. శకుంతల తదితరులు పాల్గొన్నారు.

# నీటి ఎద్దడి దృష్ట్యా చిన్న మట్టి వినాయకులను పూజించాలి

-నిమజ్జనం సమయంలో ఎటువంటి అపశ్రుతికి తావు ఉండకూడదు

-జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

నంద్యాల, ఆగస్టు, 31 వార్త సాక్ష్యం

ఎల్నినో ప్రభావం దృష్ట్యా ఏర్పడిన నీటి పరిమాణం తక్కువగా ఉన్న నేపథ్యంలో చిన్న మట్టి వినాయ కులను పూజించాలి జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం వినాయక నిమజ్జనం సందర్భంగా మండల స్థాయిలో నిర్వహించాల్సిన మండల స్థాయి సమన్వయ సమావేశంపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో డిఆర్ఓ రాము నాయక్, పిజిఆర్ఎస్ నోడల్ ఆఫీసర్ ఉమామ హేశ్వరి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. వినాయక చవితి పండుగ 14వ తారీఖున ఉన్నందున జిల్లాలో ఇప్పటి వరకే జిల్లా స్థాయి సమన్వయ సమావేశం పూర్తి అవ్వడం జరిగిందన్నారు. మండల కేంద్రాల్లో ఆర్డీవోలు (RDOs), డీఎస్పీలు (DSPs), డివిజనల్ స్థాయి అధికారులు వెంటనే డివిజనల్ లెవెల్ మీటింగ్‌లు, గ్రామ స్థాయి మీటింగ్‌లు నిర్వహిం చాలన్నారు. వినాయక నిమజ్జనం ప్రధానంగా 5వ రోజున జరుగుతోందని, కొన్ని మండలాల్లో 3వ రోజు, 4వ రోజు లేక అదే రోజే నిమజ్జనం చేయడం జరుగుతోందన్నారు. ఏ మండలాల్లో ఏ రోజు చేస్తారనే విషయాన్ని పోలీసులతో సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రస్తుతం ఉన్న పెద్ద సమస్య నీళు లేకపోవడం అని వినాయకుడిని నిమజ్జనం చేయడానికి కాలువల్లో, ట్యాంకుల్లో నీళ్లు తక్కువగా ఉన్నాయని ఆ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని చిన్న మట్టి వినాయకులను పూజించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పెద్ద విగ్రహాలు పెడితే విద్యుత్ తీగల ద్వారా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, విగ్రహాల వద్ద అనధికారికంగా విద్యుత్ లాగడం వంటి సమస్యలు రాకుండా చూడాలన్నారు. జిల్లా స్థాయిలో చర్చించిన ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా చదివి అందుకు అనుగుణంగా తగిన చర్యలు చేపట్టాలన్నారు. నీటి కొలనలు లేని చోట తాత్కాలిక చెరువు తవ్వి, నీరు నింపి క్రేన్ ద్వారా నిమజ్జనం చేయడానికి ఏర్పాట్లు చేయడం జరుగుతోందన్నారు. అందుకు సంబం ధించిన ఏర్పాట్లు తహశీల్దార్, మున్సిపల్ కమిషనర్ దీనికి బాధ్యత వహించాలన్నారు. చాలా ఘాట్ల వద్ద చిన్న పిల్లలు విగ్రహాలను తీసుకువెళ్లి ప్రమాదవశాత్తు జారి పడిపోయే అవకాశం ఉన్నందున ఘాట్ల వద్దకు



దిగేందుకు మెట్లు (Steps) ఏర్పాటు చేయడం, చుట్టూ బ్యారికేడింగ్ వేయడం, సరైన లైటింగ్ ఏర్పాటు చేయడం స్థానిక సంస్థల బాధ్యత అన్నారు. తహశీ ల్దార్లు, ఎంపీడీవోలు, ఇంజనీర్లే దీనికి ప్రత్యేకాది కారులుగా ఉంటారన్నారు. మండల స్థాయి అధికారు కట్మండలాల్లో ఘాట్లు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించి, అక్కడ తగిన భద్రత, లైటింగ్ ఉండేలా చూడాలని, ఒక్క అవాంఛనీయ సంఘటన కూడా జరగకూడదని, అవసరమైన చోట్ల నీరు నింపేలా ఏర్పాట్లు చేయాల న్నారు. మసీదులు, చర్చిల ముందు ఊరేగింపు ఎలా వెళ్లాలనే విషయాలపై స్పష్టత ఉండాలన్నారు.

## అర్జీదారుల సంతృప్తే లక్ష్యం

-కలెక్టర్ వినోద్ కుమార్



బాపట్లఆగష్టు 31 వార్తసాక్ష్యం

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను కేవలం పరిష్కరించినట్లు చూపకుండా, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. అర్జీదారులు మళ్లీ అదే సమస్యపై ఫిర్యాదు చేసే పరిస్థితి లేకుండా అధికారులు బాధ్యతతో వ్యవహరి ంచాలని సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ ఎస్ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. భూ సమస్యలు, సంక్షేమ పథకాలు, విద్య, వైద్యం, పౌరసరఫరాలు తదితర అంశాలకు సంబంధించిన సమస్యలను అర్జీదారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఒక్కొక్కరి సమస్యను అడిగి తెలుసుకున్న కలెక్టర్.. సంబంధిత శాఖల అధికారులకు వాటి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మొత్తం 152 అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. ప్రజలు సమర్పించిన ఫిర్యాదులపై సంబంధిత అధికారులు అర్జీదారులతో నేరుగా మాట్లాడి వాస్తవ పరిస్థితిని తెలుసుకోవాలని కలెక్టర్ సూచించారు. పరిష్కారం అనంతరం అర్జీదారులు సంతృప్తి చెందేలా చర్యలు తీసుకోవాలని, నాణ్యతా ప్రమాణాలను పాటించాలని స్పష్టం చేశారు. అనంతరం ఎన్నికలు, ఈ-ఆఫీస్, పీఎం సూర్యఘర్, రెడ్‌క్రాస్, సైనిక సంక్షేమం తదితర అంశాలపై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటిన నంద్యాల విద్యార్థిని జగదీశ్వరి





-అభినందించిన రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్

-భూటాన్‌లో జరిగిన 'ఇంటర్నేషనల్ గోల్ షాట్ బాల్ ఛాంపియన్‌షిప్' విజేతగా నిలిచిన జగదీశ్వరి

-పెసరాయి గ్రామానికి చెందిన బాలిక ప్రతిభను ప్రశంసించిన మంత్రి ఫరూక్

నంద్యాల ఆగష్టు 31 వార్తసాక్ష్యం

అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకుంటున్న గ్రామీణ ప్రాంత విద్యార్థులను ప్రోత్సహించడం గర్వకారణమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ అన్నారు. భూటాన్‌లోని సామ్‌డ్రప్ జోంగ్ఖార్ వేదికగా ఆగస్టు 24 నుంచి 27 వరకు నిర్వహించిన 'ఇండియా వర్సెస్ భూటాన్ ఖ-15 ఇంటర్నేషనల్ గోల్ షాట్ బాల్ ఛాంపియన్‌షిప్'లో భారత జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించి విజేతగా నిలిచిన విద్యార్థిని జగదీశ్వరి, సోమవారం నంద్యాలలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి ఎన్ఎండి ఫరూక్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. పెసరాయి గ్రామానికి చెందిన సి. నాగేశ్వరరావు కుమార్తె అయిన జగదీశ్వరి, ప్రస్తుతం నంద్యాల నెరవాడలోని మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. చిన్న వయసులోనే అంతర్జాతీయ స్థాయి ఛాంపియన్‌షిప్‌లో అద్భుత ప్రతిభ కనబరిచి దేశానికి, జిల్లాకు మంచి పేరు తెచ్చిపెట్టిన జగదీశ్వరిని మంత్రి ఫరూక్ శాలువాతో సత్కరించి, సర్టిఫికెట్‌ను అందించి హృదయపూర్వక అభినం దనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ క్రీడల్లో పట్టుదల, నిరంతర సాధన ఉంటే అంతర్జాతీయ స్థాయిలో విజయాలు సాధిం చవచ్చని జగదీశ్వరి నిరూపించిందన్నారు. ప్రభుత్వం క్రీడలకు, గ్రామీణ ప్రతిభకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, భవిష్యత్తులో జగదీశ్వరి మరిన్ని అంతర్జాతీయ పతకాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి మరింత గుర్తింపు తీసుకురావాలని ఆకాం క్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో గోవింద్ నాయుడు, బోయ రామకృష్ణ, నం ద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, ఆర్ఎంపి శివ, సంజీవ కుమార్ మరియు వాల్మీకి సంఘం ప్రతినిధులు మరియు బాలిక కుటుంబ సభ్యులు, పాఠశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రైతులతో దద్దరిల్లిన నంద్యాల జిల్లా కలెక్టరేట్..!





-సాగు, తాగునీరు అందించాలని కోరుతూ నంద్యాలలో వైసీపీ ఆధ్వర్యంలో భారీ "చలో కలెక్టరేట్" ఆందోళన విజయవంతం
-మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి నేతృత్వంలో భారీ ప్రదర్శన.
-శ్రీశైలం జలాశయంలో నీరున్నప్పటికీ రాయలసీమ ప్రాంతానికి సాగు, తాగునీరు విడుదల చేయాలని డిమాండ్.
-రైతుల సమస్యలపై జిల్లా కలెక్టర్ రాజకుమారికి వినతి పత్రం అందజేత; 2 లేదా 3 రోజుల్లో నీరు అందిస్తామని కలెక్టర్ హామీ
-వర్షాభావ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో విఫలమైందని, ప్రత్యామ్నాయ మార్గాలు చూపడంలేదని ఆరోపణ.

నంద్యాల ఆగస్టు 31 వార్త సాక్ష్యం

నంద్యాలలో ఉద్రిక్తత... రైతు కంటతడి... సాగునీరు అందక బీళ్లువారిన పొలాలు! తాగునీటి కోసం అల్లాడుతున్న జనం! ఈ సమస్యలన్నింటిపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నంద్యాలలో కదం తొక్కింది. సాగునీరు, తాగునీరు అందించాలనే డిమాండ్‌తో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన "చలో కలెక్టరేట్" కార్యక్రమం అఖండ స్పందనతో హోరెత్తింది. మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి నాయత్వంలో వందలాది మంది రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావడంతో నంద్యాల కలెక్టరేట్ ప్రాంగణం జనసందోహంతో దద్దరిల్లింది. "రైతులకు నీరు ఇవ్వాలి... ప్రజలకు తాగునీరు అందించాలి" అంటూ ఎమ్మెల్సీ ఇసాక్ భాషా, మాజీ ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి, వైసీపీ రాష్ట్ర సీఈసీ మెంబర్ పి పి నాగిరెడ్డి, నంది రైతు సమైక్య అధ్యక్షుడు రామ సుబ్బారెడ్డి, వైసిపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్స్ రామలింగారెడ్డి, సాయినాథ్ రెడ్డి, రైతులతో కలిసి చేసిన నినాదాలతో పరిసరాలు మార్మోగాయి. "శ్రీశైలం ప్రాజెక్ట్‌లో నీరు నిల్వ ఉన్నా మన ప్రాంత రైతులకు సాగునీరు ఇవ్వడానికి ఈ కూటమి ప్రభుత్వం ఎందుకు చర్యలు చేపట్టడంలేదు? చెరువులు, కుంటలు ఎండిపోయి, పంటలు బీళ్లువారుతుంటే ప్రభుత్వం చోద్యం చూస్తోంది. ప్రభుత్వ పెద్దలు స్పందించకపోవడంతో, అధికారులే రైతుల కన్నీళ్లను చూసి నీటిని విడుదల చేయాలని కోరుతున్నాం. కలెక్టర్ స్పందించి రెండు, మూడు రోజుల్లో నీరు ఇస్తామని హామీ ఇచ్చారు. ఒకవేళ ప్రభుత్వం వైఖరిలో మార్పు రాకపోతే మా పోరాటం మరింత ఉద్ధృతం అవుతుందిని శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి హెచ్చరించారు!" ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు విభాగం సెక్రటరీ రత్నబాబు చౌదరి, రాష్ట్ర మహిళా విభాగం జనరల్ సెక్రెటరీ శశికళ రెడ్డి, నంద్యాల మండలం ఎంపీపీ శెట్టి ప్రభాకర్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్లు పురుషోత్తం రెడ్డి, విజయ శేఖర్ రెడ్డి, మహేశ్వరరెడ్డి, వైసిపి నంద్యాల మండల అధ్యక్షుడు బసవేశ్వర రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ మాబునిషా, నంద్యాల జిల్లా కమిటీ సభ్యులు, ఎంపీటీసీలు సర్పంచులు నంద్యాల గోస్పాడు మండలాల రైతులు వైసిపి నాయకులు పాల్గొన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ... వర్షాభావ పరిస్థితుల్లో నీరులేక కరువు తాండవిస్తోందని, అటువంటి పరిస్థితిలో కూటమి ప్రభుత్వంలో ఎటువంటి స్పందన కనిపించలేదని విమర్శిం చారు. నీటి సమస్యను తీర్చేందుకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలను చూపడంలేదన్నారు. రైతులతో కలసి కలెక్టరేట్ ముట్టడి చేసి, ధర్నా చేసి,రస్తారోకో చేసి అనేక విధాల నిరసనలు హోరెత్తిస్తేనే రైతుల సమస్యలు పరిష్కారం కావడంలేదని, ప్రభుత్వం కళ్లు తెరిచేలా లేదని విమర్శిం చారు. గత ప్రభుత్వంలో రైతులకు అన్ని రకాలుగా భరోసాగా నిలిచామన్నారు. శ్రీశైలం ప్రాజెక్టలో నీరు నిల్వ ఉన్నాకూడా మన ప్రాంతంలోని రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం ఎందుకు చర్యలు చేపట్టడంలేదో చెప్పాలన్నారు. నీరు లేక చెరువులు, కుంటలు ఎండిపోయామని,



పంటలు బీళ్లుబారాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాయలసీమ ప్రాంతంలో నీరు ఉన్నా మనకు ఆ నీటిని విడుదల చేయలేని దౌర్భాగ్య పరిస్థితిలో ఈ కూటమి ప్రభుత్వం ఉందన్నారు. ఇందతా ప్రభుత్వం అసమర్థతను తెలియజేస్తుందన్నారు. ప్రభుత్వంపై, ప్రభుత్వ పెద్దలపై, మంత్రులపై ఎటువంటి నమ్మకం లేదని కేవలం అధికారులు రైతుల కష్టాలను, కన్నీలను చూసి నీటిని విడుదల చేయాలని కోరారు. వర్షాభావ పరిస్థితుల్లో అధికారులు పంటలు వేయకండని సూచిస్తున్నారని, అయితే రైతులకు ప్రత్యామ్నాయ భరోసా ఇవ్వడం లేదని, పంటల భీమా అమలు చేయడం లేదని, ఆరుతడి పంటలను సాగు చేయాలని అధికారులు చెబుతున్నారని అయితే వాటికి కూడా కనీసం నీరు అందించలేక పోయారన్నారు. సాగునీరు త్రాగు నీరు ఎప్పుడు విడుదల చేస్తారో బహిర్గతంగా చెప్పాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలైన సాగునీరు, ప్రజలకు త్రాగు నీరు అందించాలని జిల్లా కలెక్టర్కు తెలియజేయడం జరిగిందని పేర్కొన్నారు. రెండు లేదా మూడు రోజుల్లో నీరు అందిస్తామని జిల్లా కలెక్టర్ హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. రైతులను ఆదుకొనేందుకు, రైతుల పక్షాన నిలబడతామని, రైతుల గొంతుక అవుతామని తెలిపారు. రైతుల పక్షాన రైతుల కోసం పార్టీలకు అతీతంగా తమ మద్దతు పలుకుతామని స్పష్టంచేశారు. రైతుల కష్టాలను తీర్చేందుకు ఒక రైతు బిడ్డగా జిల్లా కలెక్టర్ స్పందించి నీటిని విడుదల చేస్తుందన్న ఆశతో ఉన్నామన్నారు. ప్రభుత్వం వైఖరిలో మార్పులేకుంటే, ప్రజల సమస్యలు, రైతుల సమస్యలను పరిష్కరించకుంటే పోరాటాలు ఆగవని, నిరసనలు ఆగవని, మరింత పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. రైతులు, యువత, ఉద్యోగులు ప్రతి ఒక్క వర్గం వారు రోడ్లపైకి వచ్చి నిరసన తెలుపుతున్నారని ఇది ప్రభుత్వం నిర్లక్షవైఖరికి నిదర్శనం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యావసర సరుకుల ధరలు నియంత్రణ జరగాలంటే రైతన్నలు పంటలు పండిచాలని, పంటల సాగుకు నీరు అందించాలని కోరారు. రైతులకు అవసరమైన వాటిని అందించలేని ప్రభుత్వం మద్యం మాత్రం డోర్ డెలివరీ చేస్తున్న పరిస్థితి ఈ రాష్ట్రంలో నెలకొన్నదని విమర్శించారు.

## సీఎస్కేలో ధోనీ వాటా.. వదంతులను ఖండించిన సీఈవో

చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) ఫ్రాంచైజీలో ఆ జట్టు మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ వాటా కోరుతున్నట్లు వస్తున్న వార్తలను సీఎస్కే యాజమాన్యం ఖండించింది. ఈ కథనాల్లో ఎలాంటి వాస్తవం లేదని, అవన్నీ కేవలం నిరాధారమైన వదంతులని సీఎస్కే సీఈవో కాశీ విశ్వనాథన్ స్పష్టం చేశారు. దీంతో గత కొన్ని రోజులుగా సాగుతున్న ప్రచారానికి తెరపడింది. ఐపీఎల్ ప్రారంభం నుంచి సీఎస్కేతో ధోనీకి విడదీయరాని అనుబంధం ఉంది. అతడి సారథ్యంలో జట్టు ఏకంగా ఐదుసార్లు ఐపీఎల్ టైటిళ్లను కైవసం చేసుకుంది. ఈ నేపథ్యంలో, ఫ్రాంచైజీతో తన బంధాన్ని మరింత బలోపేతం చేసుకునే క్రమంలో ధోనీ సుమారు 20 శాతం వాటాను కొనుగోలు చేయాలని భావిస్తున్నాడని, కానీ సీఎస్కే యాజమాన్యం కేవలం 3 శాతం మాత్రమే ఆఫర్ చేసిందని కథనాలు వెలువడ్డాయి. ఈ పరిణామాలతో ఇరువర్గాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయని కూడా జోరుగా ప్రచారం జరిగింది. ఈ వదంతులపై కాశీ విశ్వనాథన్ స్పందిస్తూ, "ధోనీ వాటా అడిగాడన్న వార్తల్లో ఏమాత్రం వాస్తవం లేదు. అవన్నీ కేవలం పుకార్లు మాత్రమే" అని కొట్టిపారేశారు. ఇక వచ్చే సీజన్‌లో ధోనీ ఆడతాడా లేదా అనే విషయంపై కూడా ఆయన వివరణ ఇచ్చారు. "వచ్చే సీజన్‌లో తాను ఆడనని ధోనీ మాతో ఎప్పుడూ చెప్పలేదు. ఏదైనా అతడిదే తుది నిర్ణయం" అని తెలిపారు. కాగా, 2025 మెగా వేలానికి ముందు సీఎస్కే ధోనీని రూ. 4 కోట్లకు రిటైన్ చేసుకుంది.



అయితే, గాయం కారణంగా 2026 సీజన్‌లోని ఒక్క మ్యాచ్‌లో కూడా ధోనీ ఆడలేకపోయాడు.

## మెస్సీ శకం ముగిసింది.. అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన లెజెండ్

ఫుట్‌బాల్ ప్రపంచంలో ఒక శకం ముగిసింది. అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం, కోట్లాది మంది అభిమానుల ఆరాధ్య దైవం లియోనెల్ మెస్సీ తన అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. రెండు దశాబ్దాల పాటు అర్జెంటీనా జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఆ లెజెండ్, ఇకపై దేశం తరఫున బరిలోకి దిగనని సోమవారం (ఆగస్టు 31) సంచలన ప్రకటన చేశాడు. ఈ మేరకు తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఒక భావోద్వేగ లేఖను పోస్ట్ చేశాడు. 2026 ప్రపంచకప్ ఫైనల్‌లో స్పెయిన్ చేతిలో ఓటమి పాలైనప్పటి నుంచే రిటైర్మెంట్ ఆలోచనలో ఉన్నానని, తన తండ్రి మరణం ఆ నిర్ణయాన్ని మరింత బలపరిచిందని మెస్సీ ఆ లేఖలో పేర్కొన్నాడు. మెస్సీ వీడ్కోలు వార్త ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఫుట్‌బాల్ అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది.

**-భావోద్వేగ లేఖలో మెస్సీ ఏమన్నాడంటే?**

"ఫైనల్ ముగిసినప్పటి నుంచి సుదీర్ఘంగా ఆలోచించిన తర్వాత, నేను జాతీయ జట్టు నుంచి రిటైర్ అవుతున్నానని అందరికీ తెలియజేయాలనుకుంటున్నాను" అని మెస్సీ తన ప్రకటనను ప్రారంభించాడు. తన కెరీర్ ఆద్యంతం అర్జెంటీనా అభిమానులతో, జాతీయ జట్టుతో పెనవేసుకున్న అనుబంధం కారణంగా ఈ నిర్ణయం తీసుకోవడం చాలా బాధాకరంగా ఉందని తెలిపాడు. "ఈ నిర్ణయం నన్ను తీవ్రంగా గాయపరిచింది, ఇప్పటికీ బాధిస్తూనే ఉంది. కానీ, ఇదే సరైన సమయమని నేను అర్థం చేసుకున్నాను. నా దేశం కోసం నేను ఎప్పుడూ సర్వస్వం



ఇచ్చానని ప్రమాణం చేస్తున్నాను. కేవలం గెలిచిన మ్యాచ్ లలోనే కాదు, అంతకుముందు కూడా ఈ జెర్సీ కోసం నేను ఎప్పుడూ పోరాడాను, నా సర్వశక్తులు ఒడ్డాను. ఫుట్‌బాల్ ద్వారా మీకు ఆనందాన్ని పంచడానికి, అర్జెంటీనా పౌరుడిగా మీరు గర్వపడేలా చేయడానికి ప్రయత్నించాను" అని భావోద్వేగంగా రాసుకొచ్చాడు.

# స్పోర్ట్స్

### తిలక్ వర్మ అజేయ సెంచరీ.. పటిష్ట స్థితిలో సౌత్ జోన్



దులీప్ ట్రోఫీ సెమీ ఫైనల్‌లో నార్త్ జోన్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో సౌత్ జోన్ కెప్టెన్ తిలక్ వర్మ అద్భుతమైన సెంచరీతో జట్టును ఆదుకున్నాడు. అతనికి శ్రేయస్ గోపాల్ (88) కీలక ఇన్నింగ్స్‌తో తోడవడంతో సౌత్ జోన్ పటిష్ఠ స్థితిలో నిలిచింది. బెంగళూరులోని బీసీసీఏ గ్రౌండ్‌లో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో, రెండో రోజు ఆట ముగిసే సమయానికి సౌత్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 9 వికెట్ల నష్టానికి 285 పరుగులు చేసింది. దీంతో నార్త్ జోన్‌పై 90 పరుగుల కీలక ఆధిక్యాన్ని సంపాదించింది. నార్త్ జోన్‌ను తొలి ఇన్నింగ్స్‌లో 195 పరుగులకే కట్టడి చేసిన అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన సౌత్ జోన్‌కు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్లు రికీ భుయ్ (5), షేక్ రషీద్ (0) విఫలమవడంతో పాటు, మిడిలార్డర్ కూడా చేతులెత్తేసింది. దీంతో సౌత్ జోన్ ఒక దశలో 80 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి తీవ్ర కష్టాల్లో పడింది. గుర్నూర్ బ్రార్ తన పదునైన బౌలింగ్‌తో సౌత్ బ్యాటర్లను ఇబ్బంది పెట్టాడు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ తిలక్ వర్మ, శ్రేయస్ గోపాల్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. వీరిద్దరూ నార్త్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ ఆరో వికెట్‌కు 175 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పారు. ఈ క్రమంలో శతకానికి చేరువైన శ్రేయస్ గోపాల్ 88 పరుగుల వద్ద అర్షదీప్ సింగ్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఆ తర్వాత సౌత్ జోన్ మళ్లీ వికెట్లు కోల్పోయింది. అయితే, ఒక ఎండ్‌లో పాతుకుపోయిన తిలక్ వర్మ తన ఫస్ట్ క్లాస్ కెరీర్‌లో 8వ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. ఆట ముగిసే సమయానికి 225 బంతుల్లో 106 పరుగులతో అజేయంగా నిలిచాడు.

VARTHAA SAKSHAMU వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక RNI Title Code: APTEL/25/A5153 Editor : SAGINALA RAVI KUMAR

మంగళవారం 01 సెప్టెంబర్ 2026

# ‘రోమాంచకం’లో బబ్లీ గర్ల్ పాత్ర నా కల నెరవేరింది: అనంతిక సనిల్‌కుమార్

బ్లాక్‌బస్టర్ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా సమర్పణలో, భద్రకాళి పిక్చర్స్ పతాకంపై సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్‌కుమార్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం ‘రోమాంచకం’. ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్న ఈ చిత్రంతో వేణుగోపాల్ రెడ్డి దర్శకుడిగా పరిచయ మవుతున్నారు. ప్రేమ, హాస్యం, ఉత్కంఠ కలగలిసిన యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ సినిమా సెప్టెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో సోమవారం చిత్ర హీరోయిన్ అనంతిక మీడియాతో ముచ్చటించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా అనంతిక మాట్లాడుతూ, “‘8 వసంతాలు’ తర్వాత చాలా కథలు విన్నాను. కానీ ఏదీ నన్ను అంతగా ఆకట్టుకోలేదు. ఆ సమయంలో ‘రోమాంచకం’ కథ వినగానే చాలా సంతోషం వేసింది. నేను చేయాలనుకున్న సినిమా ఇదే అనిపించింది. ఈ సినిమాలో బబ్లీగా, సరదాగా ఉండే అమ్మాయి పాత్ర నాది. ఇలాంటి పాత్ర చేయాలని ఎప్పటినుంచో కలలు కన్నాను” అని తెలిపారు. “ఈ చిత్రం యువతకు బాగా కనెక్ట్ అవుతుంది. ఇది కేవలం ప్రేమకథ మాత్రమే కాదు, ఇందులో హాస్యంతో పాటు ఉత్కంఠ కూడా ఉంటుంది. యూత్‌తో పాటు కుటుంబ ప్రేక్షకులు కూడా ఎంజాయ్ చేయవచ్చు. ఇందులో నేను తమిళ అమ్మాయిగా కనిపిస్తాను. హీరో సుమంత్ ప్రభాస్ పాత్ర చాలా ఎనర్జిటిక్‌గా ఉంటుంది. దానికి తగ్గట్టుగానే నా పాత్రను కూడా డిజైన్ చేశారు. మా ఇద్దరి మధ్య సంభాషణలు చాలా సహజంగా, వేగంగా సాగుతాయి” అని ఆమె వివరించారు. రోమాంచకం సినిమా చిత్రీకరణ అనుభవాల గురించి చెబుతూ, “షూటింగ్ సమయంలో ఎంత సరదాగా గడిపామో, సినిమా చూస్తున్నప్పుడు ప్రేక్షకులు కూడా అంతే ఎంజాయ్ చేస్తారు. సందీప్ గారు నా నటనను మెచ్చుకోవడం సంతోషంగా ఉంది. నిర్మాత ప్రణయ్ రెడ్డి గారిని మొదట చూసినప్పుడు కోపం ఎక్కువ అనుకున్నాను, కానీ ఆయన చాలా సరదా మనిషి. సుమంత్ ప్రభాస్‌తో తొలిరోజే మంచి స్నేహం కుదిరింది” అంటూ షూటింగ్ అనుభవాలను పంచుకున్నారు. చిన్నప్పటి నుంచి తనకు కళలంటే ఇష్టమని, ఎల్‌కేజీ నుంచే డ్యాన్స్ నేర్చుకుంటున్నానని, ఆ అనుభవమే నటిగా తనకు ఎంతగానో ఉపయోగపడుతోందని అనంతిక పేర్కొన్నారు. మంచి అవకాశాలు వస్తే ఏ భాషలోనైనా నటిస్తానని ఆమె స్పష్టం చేశారు. చివరగా, “రోమాంచకం సినిమాలో ప్రేమ, హాస్యం, ఉత్కంఠ అనే మూడు అంశాలు బలంగా ఉంటాయి. ముఖ్యంగా ప్రేమ నుంచే ఉత్కంఠ పుట్టడం ఆసక్తికరంగా ఉంటుంది. ఈ సినిమా నాకే కాకుండా హీరోకి కూడా మంచి గుర్తింపు



తెస్తుందని నమ్ముతున్నాను. ప్రస్తుతం తెలుగు, తమిళ, మలయాళంలో కొన్ని ప్రాజెక్టుల చర్చలు జరుగుతు న్నాయి” అని ఆమె ముగించారు.

# డీప్‌ఫేక్ వీడియో వైరల్ తీవ్రంగా స్పందించిన ‘అర్జున్ రెడ్డి’ హీరోయిన్

అర్జున్ రెడ్డి’ చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన నటి షాలినీ పాండే, తనపై ఆన్‌లైన్‌లో వైరల్ అవుతున్న డీప్‌ఫేక్ వీడియోపై తీవ్రంగా స్పందించారు. ఇది పూర్తిగా కల్పితమని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతతో సృష్టించిన నకిలీ వీడియో అని ఆమె స్పష్టం చేశారు. ఈ మేరకు ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఒక పోస్ట్ చేశారు. “ఆన్‌లైన్‌లో ప్రచారమవుతున్న ఆ వీడియో పూర్తిగా అవాస్తవం. అందులో ఉన్నది నేను కాదు” అని షాలినీ స్పష్టం చేశారు. సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ వ్యక్తులను, ముఖ్యంగా మహిళలను లక్ష్యంగా చేసుకోవడం తనను తీవ్రంగా కలచివేసిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించకూడదని, ఇది ఒక రకమైన వేధింపేనని ఆమె పేర్కొన్నరు. ఈ సందర్భంగా ఆమె ప్రజలకు ఒక ముఖ్యమైన విజ్ఞప్తి చేశారు. ఆ నకిలీ వీడియోను ఎవరూ షేర్ చేయవద్దని, ఇతరులకు పంపవద్దని, అలాగే డౌన్‌లోడ్ చేయవద్దని కోరారు. దానికి బదులుగా, ఆ వీడియోను వెంటనే రిపోర్ట్ చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి, ఇలాంటి కల్పిత వీడియోల వ్యాప్తిని అరికట్టడంలో సహకరించాలని కోరారు. ఇటీవల కాలంలో డీప్‌ఫేక్ వీడియోల బారిన పడుతున్న ప్రముఖుల జాబితాలో షాలినీ పాండే కూడా చేరారు. గతంలో రష్మిక మందన్న, దీపికా పదుకొణె, కత్రినా కైఫ్, అలియా భట్, ఆమిర్ ఖాన్, రణ్‌వీర్ సింగ్ వంటి పలువురు సినీ తారలు ఇలాంటి నకిలీ వీడియోల వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. షాలినీ పాండే ‘అర్జున్ రెడ్డి’తో పాటు ‘మహానటి’, ‘జయేష్‌భాయ్ జోర్దార్’, ‘మహారాజ్’ వంటి చిత్రాలలో నటించి గుర్తింపు పొందారు.



## పుట్టబోయే బిడ్డకు ‘సామ్రాజ్’ పేరు.. సమంత ఫన్నీ రియాక్షన్!

ప్రముఖ నటి సమంత ప్రస్తుతం గర్భవతి అన్న విషయం తెలిసిందే. సినిమాలకు తాత్కాలిక విరామం ఇచ్చి మాతృత్వాన్ని ఆస్వాదిస్తున్న ఆమె, సోషల్ మీడియా వేదికగా నిరంతరం అభిమానులతో సంభాషిస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా అభిమానులతో జరిపిన చిట్‌చాట్‌లో ఆమె చేసిన ఒక సరదా వ్యాఖ్య ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. తమకు పుట్టబోయే బిడ్డ కోసం మంచి పేర్లను సూచించాల్సిందిగా సమంత తన అభిమానులను కోరారు. దీనిపై స్పందించిన ఒక అభిమాని, పాప పుడితే ‘సమైరా’ అని, బాబు పుడితే ‘సామ్రాజ్’ అని పేరు పెట్టాలని సూచించారు. సమంత, ఆమె భర్త, ప్రముఖ ఫిల్మ్‌మేకర్ రాజ్ నిడిమోరుల పేర్లు కలిసొచ్చేలా ఆ అభిమాని ఈ పేర్లను ప్రతిపాదించడం విశేషం. ఈ సూచనపై సమంత తనదైన శైలిలో చమత్కారంగా స్పందించారు. ముఖ్యంగా ‘సామ్రాజ్’ అనే పేరుపై బదులిస్తూ, “మన గురించి మనమే కాస్త ఎక్కువగా ఆలోచిస్తున్నట్లు అనిపించడం లేదా?” అంటూ నవ్వుతున్న ఎమోజీలతో రిప్లై ఇచ్చారు. తన పేరులోని ‘సామ్’, రాజ్ పేరులోని ‘రాజ్’ కలిపి పెట్టిన ఈ పేరు వినడానికి కాస్త ఆత్మస్తుతిలా ఉందన్న ఉద్దేశంతో ఆమె చేసిన ఈ వ్యాఖ్య నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటోంది.



PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.